

## నీకు ఎయిడ్స్ ఉందా అని అడిగాడు

ప్రముఖ రియాలిటీ షో 'బిగ్‌బాస్' వేదికగా మలయాళ నటి గాయత్రి సురేష్ తన వ్యక్తిగత జీవితంలో ఎదురైన తీవ్రమైన చేదు అనుభవాన్ని పంచుకుని సంచలనం సృష్టించారు. ప్రముఖ నటుడు మోహన్‌లాల్ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న 'బిగ్‌బాస్ మలయాళం సీజన్-8'లో పాల్గొంటున్న ఆమె.. ఓ టాస్క్ సందర్భంగా తన గతం, విఫలమైన సంబంధాల గురించి భావోద్వేగంగా మాట్లాడారు.

8


ప్రజా గళమే

# స్పంద

SPANDHA NEWS

జాతీయ తెలుగు దినపత్రిక

Praja Galame Spanda సత్యానికి స్వరం APMUL/26/A3106





బుధవారం || 7-10-2026 || సంపుటి: 1 || సంచిక: 63 || పేజీలు: 8 || వెల : రూ.5/- Circulated From : Guntur, Vijayawada, Visakhapatnam, Prakasham, Nellore, Thirupathi, Hyderabad, Rangareddy, Medak, Karimnagar, Warangal

# జనసైనికుల ఆశలు ఫలిస్తాయా?



స్థానిక పోరులో సీట్ల పంచాయితీ!

యాభై శాతం సీట్లు కోరుతున్న జనసేన

మేయర్, చైర్మన్ పీఠాలపై పవన్ పట్టు

బీసీ రిజర్వేషన్లు తేలాకే బాబు నిర్ణయం

స్థానిక ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించిన కూటమికి.. రాబోయే స్థానిక పోరులో సీట్ల సర్దుబాటు వ్యవహారం పెద్ద పరీక్షగా మారుతోంది. జనసేన ఎమ్మెల్యేలున్న నియోజకవర్గాల్లో ఏకంగా సగం సీట్లతో పాటు కీలకమైన మున్సిపల్, మేయర్ పీఠాలు తమకే కావాలని పవన్ కల్యాణ్ గట్టిగా పట్టుబడుతున్నారు. అయితే బీసీ రిజర్వేషన్లు తేలాకే నిర్ణయమంటూ సీఎం చంద్రబాబు దాటవేస్తుండటంతో సీట్ల పంచాయితీపై ఉత్కంఠ నెలకొంది. మరోవైపు సంస్థాగత బలం లేకపోవడం, మంత్రుల తీరుపై కేడర్ అసంతృప్తి జనసేనకు సవాల్‌గా మారిన వేళ.. టీడీపీ పెద్దల ముందు జనసైనికులు తమ బలాన్ని ఎలా నిరూపించుకుంటారనేది ఆసక్తికరంగా మారింది.

జనసేన పార్టీ

వివరాలు 2లో..



భూమి ఉంది..

# హక్కుకు అడ్డుగోడ!

22ఏ నిషేధ విముక్తిపై ప్రకటనలు.. అమలుపై ప్రశ్నలు

ఆర్డీవోలకు అధికారాలు.. ప్రజలకు ఇంకా నిరీక్షణ

- డిస్పోజల్ లెక్కలే తప్ప.. రిజిస్ట్రేషన్ల లెక్క ఏది?
- ఫ్రీహోల్డ్ భూములకు ఊరట.. రికార్డుల అనుసంధానమే కీలకం
- స్పష్టత కరువైన 22ఏ మొత్తం విస్తీర్ణం

భూమి చేతిలో ఉన్నా, అవసరానికి అమ్ముకుందామంటే వీల్లేని దుస్థితి.. హక్కుల సాధన కోసం కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్న సగటు జీవి ఆవేదన ఇది. ఆంధ్రప్రదేశ్‌లో ఏళ్ల తరబడి వేధిస్తున్న '22ఏ' (నిషేధిత జాబితా) భూముల సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం నడుంబిగించింది. ఇందులో భాగంగా అధికారాల వికేంద్రీకరణ, ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్ల పునరుద్ధరణ, రికార్డుల సవరణ లాంటి కీలక చర్యలు చేపట్టింది. మాజీ సైనికులు, స్వాతంత్ర్య సమరయోధుల భూములతో పాటు 1954కు ముందు అసైన్ చేసిన భూములకు నిషేధ విముక్తి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ప్రభుత్వం తీసుకుంటున్న ఈ నిర్ణయాలు క్షేత్రస్థాయిలో ఆశించినంత వేగంగా అమలు కావడం లేదు. దరఖాస్తు పరిష్కారం (ఫైల్ డిస్పోజ్) జరిగినంత మాత్రాన సమస్య తీరినట్లు కాదు; రెవెన్యూ శాఖ నిర్ణయం, రిజిస్ట్రేషన్ శాఖ నిషేధ జాబితా, వెబ్‌ల్యాండ్ రికార్డులన్నీ ఒకేసారి అప్‌డేట్ అయినప్పుడే రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమం అవుతుంది. కాగితాలపై ఉత్తర్వులు జారీ చేయడమే కాదు.. సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎలాంటి అడ్డంకులు లేకుండా ఆ భూమిపై క్రయవిక్రయాలు చేసుకునే అవకాశం లభించినప్పుడే రైతులకు, యజమానులకు '22ఏ' నుంచి నిజమైన విముక్తి!

వివరాలు 3వ పేజీలో




# బ్రో.. రాజీనామా సమయం వచ్చింది

- ఓటర్ల జాబితా వివాదంపై రాహుల్ గాంధీ ఘాటు హెచ్చరిక
- జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా కోరుతూ ఎన్నికల సంఘం కార్యాలయానికి విపక్షాల మార్చ్

4




# రాజధాని పనులు పరుగులు పెట్టాలి

నెలకు రూ. 2 వేల కోట్ల పనులు జరగాలని సీఎం ఆదేశం

- నిర్మాణ సంస్థలు, అధికారులతో చంద్రబాబు నెలవారీ సమీక్ష
- కేంద్రం సహకారంతో ఔటర్ రింగ్ రోడ్డు పట్టాలెక్కాలి
- ఐకానిక్‌గా అసెంబ్లీ, సచివాలయ భవనాల నిర్మాణాలు
- నాణ్యత, వేగంలో ఎక్కడా రాజీ పడొద్దని స్పష్టీకరణ



2



2

# బీసీ రిజర్వేషన్లపై రాజీలేని పోరాటం!

- స్థానిక సంస్థల్లో 34 శాతం సీట్లు సాధించడమే లక్ష్యం
- న్యాయపోరాటం చేస్తున్నామన్న మంత్రులు
- ఢిల్లీ ఏపీ భవన్‌లో మంత్రుల మీడియా సమావేశం



## న్యూట్రినో పరిశోధనలకు నోబెల్!

- భౌతిక శాస్త్రంలో ప్రొఫెసర్ ఫ్రాన్సిస్ హాల్జెన్‌కు అత్యున్నత పురస్కారం
- అత్యధిక శక్తిగల ఖగోళ న్యూట్రినోల గుర్తింపులో విశేష కృషి

4

## రవాణాకు 'ఐటీఎల్ఏ'

కేంద్ర కేబినెట్‌లో కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర

చిన్న పరిశ్రమలకు రూ.10 వేల కోట్ల బూస్ట్!

సమగ్ర రవాణా, లాజిస్టిక్స్ ప్రణాళికకు ప్రత్యేక అథారిటీ



4

## చంద్రబాబు నాటకాలు

మాజీ మంత్రి వేణుగోపాల కృష్ణ

3





## ఏపీకి భారీ పెట్టుబడి

- రూ. 6,700 కోట్లతో శ్రీ సిమెంట్స్ రాక
- ఏకంగా 3 వేల మందికి ఉపాధి అవకాశాలు
- విశాఖలో మంత్రి టీజీ భరత్‌తో సంస్థ ప్రతినిధుల భేటీ

2

## తీరు మార్చుకోకుంటే ఖబడ్దార్

- జగన్, వైసీపీ నేతలకు మంత్రి సవిత స్ట్రాంగ్ వార్నింగ్



4

ప్రజాగళమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక

బుధవారం, 7 అక్టోబర్ 2026




# రాజధాని పనులు పరుగులు పెట్టాలి!

**నెలకు రూ. 2 వేల కోట్ల పనులు జరగాలని సీఎం ఆదేశం**

**నిర్మాణ సంస్థలు, అధికారులతో చంద్రబాబు నెలవారీ సమీక్ష**

**కేంద్రం సహకారంతో ఔటర్ రింగ్ రోడ్డు పట్టాలెక్కాలి**

**ఐకానిక్‌గా అసెంబ్లీ, సచివాలయ భవనాల నిర్మాణాలు**

**నాణ్యత, వేగంలో ఎక్కడా రాజీ పడొద్దని స్పష్టీకరణ**

**అమరావతి (స్పంద న్యూస్):** రాజధాని అమరావతి నిర్మాణ పనులు మరింత వేగవంతం కావాలని, నెలకు రూ. 2 వేల కోట్ల విలువైన పనులు జరిగేలా పక్కా ప్రణాళికతో అడుగులు వేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాజధాని పనులపై మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ఆయన ఉన్నతాధికారులు, కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులతో నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాజధాని పరిధిలో చేపట్టిన 152 ప్రాజెక్టుల్లో సుమారు 41 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ వివరించారు. పనుల పురోగతి, ఆయా ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిగతులను అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గడిచిన నెలలో రాజధానిలో రూ. 1,345 కోట్ల విలువైన పనులు జరిగినట్టు వారు వెల్లడించారు. ఈ పనుల వేగాన్ని మరింత పెంచి నెలకు రూ. 2 వేల కోట్లకు చేర్చాలని సీఎం స్పష్టం చేశారు. రాజధాని నిర్మాణంతో పాటు ఔటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టును త్వరగా పట్టాలెక్కించాలని అధికారులకు చంద్రబాబు సూచించారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం చేసుకోవాలన్నారు. రాజధాని పనుల్లో ఎక్కడా అశ్రద్ధ, నిర్లక్ష్యం లేకుండా నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా సచివాలయ టవర్లు, అసెంబ్లీ భవనాలు అత్యంత ఐకానిక్‌గా ఉండాలని, ఈ ఐకానిక్ భవనాల నిర్మాణాల్లో ఎక్కడా జాప్యానికి వీల్లేదని తేల్చిచెప్పారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ తరహాలోనే ఇక్కడి నిర్మాణ రంగ కార్మికులకు, సిబ్బందికి ఆధునిక నైపుణ్యాలు అందించాల్సిన అవసరం ఉందని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. పనుల నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి నారాయణతో పాటు కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# శభాష్ గాయత్రీ.. సీఎం ప్రశంసల జల్లు!

**దివ్యాంగ భక్తుడి ఆకలి తీర్చిన ఆలయ మహిళా సిబ్బంది**

**రెండు చేతులు లేని భక్తుడికి స్వయంగా అన్నం తినిపించిన వైనం**

**మానవ సేవే మాధవ సేవ అంటూ కొనియాడిన ముఖ్యమంత్రి**

**అమరావతి (స్పంద న్యూస్):** ద్వారకాతిరుమల ఆలయ అన్నప్రసాద కేంద్రంలో రెండు చేతులు లేని దివ్యాంగ భక్తుడికి స్వయంగా అన్నం తినిపించిన మహిళా సిబ్బంది గాయత్రిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రశంసల జల్లు కురిపించారు. ఈ నెల 3వ తేదీన జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై సీఎం చంద్రబాబు స్పందిస్తూ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఆమెను అభినందించారు. దివ్యాంగ భక్తుడు సత్యనారాయణకు గాయత్రి అన్నం తినిపిస్తున్న వీడియోను సీఎం తన ఖాతాలో పోస్ట్ చేశారు. 'శభాష్ గాయత్రీ.! ద్వారకా తిరుమల అన్నప్రసాద కేంద్రంలో చేతులు లేని దివ్యాంగ భక్తుడికి అన్నం తినిపించి ఆకలి తీర్చిన మీ సహృదయానికి వందనాలు. మానవ సేవే మాధవ సేవ అని చాటి చెప్పిన మీ స్ఫూర్తి అభినందనీయం' అని ముఖ్యమంత్రి ఆ పోస్టులో పేర్కొన్నారు.

# కడప దర్గా ఉర్సుకు సీఎంకు ఆహ్వానం!

**అమీన్ పీర్ దర్గా పెద్దలతో ముఖ్యమంత్రి భేటీ**

**క్యాంప్ కార్యాలయంలో చంద్రబాబును కలిసిన పీఠాధిపతి**

**ఈ నెల 24 నుంచి 29 వరకు ఉర్సు ఉత్సవాలు**

**ఏర్పాట్లపై ఆరా తీసిన సీఎం చంద్రబాబు**

**కడప (స్పంద న్యూస్):** ప్రసిద్ధ కడప అమీన్ పీర్ దర్గా ఉర్సు ఉత్సవాలకు



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును దర్గా పెద్దలు ఘనంగా ఆహ్వానించారు. అమీన్ పీర్ దర్గా పీఠాధిపతి కేఎస్ఎస్ అరీఫుల్లా హుస్సేనీ మంగళవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు ఉత్సవాల ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ నెల 24వ తేదీ నుంచి 29వ తేదీ వరకూ కడపలో వైభవంగా జరిగే ఈ ఉర్సు ఉత్సవాలకు తప్పకుండా హాజరుకావాలని వారు ముఖ్యమంత్రిని కోరారు. ఈ సందర్భంగా ఉర్సు ఉత్సవాలకు సంబంధించి చేస్తున్న ఏర్పాట్ల గురించి దర్గా పెద్దలను సీఎం అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో అరీఫుల్లా హుస్సేనీతో పాటు దర్గా మేనేజర్ ఎమ్‌డీ అలీఖాన్, సయ్యద్ గౌస్, అమీర్ బాషా తదితరులు ఉన్నారు.

# జనసైనికుల ఆశలు ఫలిస్తాయా?

- స్థానిక పోరులో సీట్ల పంచాయితీ!
- యాభై శాతం సీట్లు కోరుతున్న జనసేన
- మేయర్, చైర్మన్ పీఠాలపై పవన్ పట్టు
- బీసీ రిజర్వేషన్లు తేలాకే బాబు నిర్ణయం
- పార్టీ నేతల ముందు పవన్ ప్రతిపాదనలు
- వైసీపీని చిత్తు చేయడమే ఉమ్మడి లక్ష్యం

**అమరావతి (స్పంద న్యూస్):** రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పొత్తుల పంచాయితీ, సీట్ల సర్దుబాటు వ్యవహారం అధికార కూటమిలో సరికొత్త చర్చకు దారితీస్తోంది. టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మంగళవారం ఉదయం భేటీ అయ్యారు. వీరిద్దరి సమావేశం ముగిసిన అనంతరం జనసైనికుల్లో భారీ ఆశలు చిగురిస్తున్నాయి. రాబోయే మున్సిపాలిటీలు, పంచాయతీ ఎన్నికల్లో తమ పార్టీకి అధిక సంఖ్యలో స్థానాలు దక్కుతాయని జనసేన శ్రేణులు భావిస్తున్నాయి. పలువురు నాయకులు ఇప్పటికే మేయర్, మున్సిపల్ చైర్మన్, కార్పొరేటర్, కౌన్సిలర్ పీఠాలను దక్కించుకోవడానికి గ్రౌండ్ వర్క్ సిద్ధం చేసుకుంటున్నారు. అయితే సీట్ల సర్దుబాటులో ఎక్కడ, ఏయే స్థానాలు దక్కుతాయనే దానిపై మాత్రం ఇంకా ఎలాంటి స్పష్టత రాలేదు.

## 50 శాతం సీట్లకు పవన్ పట్టు..

మంగళవారం జరిగిన భేటీలో తాము ఆశిస్తున్న స్థానాల ప్రాథమిక జాబితాను సీఎం చంద్రబాబుకు పవన్ కల్యాణ్ అందజేసినట్లు సమాచారం. ముఖ్యంగా జనసేన ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల పరిధిలో మేయర్, మున్సిపల్ చైర్మన్ స్థానాలతో పాటు.. 50 శాతం కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, పంచాయతీ వార్డు సభ్యుల సీట్లను జనసేనకే కేటాయించాలని పవన్ గట్టిగా కోరినట్లు తెలుస్తోంది. పార్టీని సంస్థాగతంగా విస్తరించుకోవడానికి స్థానిక సంస్థల ఎన్నికలే సరైన అవకాశమని పవన్ భావిస్తున్నారు. ఇటీవల జరిగిన పార్టీ అంతర్గత సమావేశంలోనూ ఆయన మాట్లాడుతూ.. తమకు రావాల్సిన స్థానాలను సగౌరవంగా దక్కించుకుంటామని, సీట్లను ఎవరూ భిక్ష వేయబోరని స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాము కోరిన స్థానాల విషయంలో పవన్ ఏమాత్రం వెనక్కి తగ్గే అవకాశం లేదని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

## బీసీ రిజర్వేషన్ల పేరుతో చంద్రబాబు దాటవేత..

పవన్ కల్యాణ్ తీసుకొచ్చిన సీట్ల ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎలాంటి ముందస్తు హామీ ఇవ్వలేదని తెలిసింది. ప్రస్తుత పరిస్థితుల్లో సీట్లపై వెంటనే నిర్ణయం తీసుకోవడం సాధ్యం కాదని, బీసీ రిజర్వేషన్ల వ్యవహారం ఇంకా కొలిక్కి రాలేదని చంద్రబాబు పేర్కొన్నట్లు సమాచారం. ఎన్నికల కమిషన్ నుంచి అధికారిక షెడ్యూల్ వెలువడిన తర్వాతే దీనిపై ఒక నిర్ణయానికి రావచ్చని చెబుతూ విషయాన్ని తాత్కాలికంగా దాటవేసినట్లు వినికిడి. అంతేకాకుండా, పవన్ కల్యాణ్ ఇచ్చిన ప్రతిపాదనలను టీడీపీ సీనియర్ నాయకులు, ముఖ్య నేతల పరిశీలనకు చంద్రబాబు పంపినట్లు సమాచారం.

## సంస్థాగత బలంపై ప్రశ్నలు.. మంత్రులపై కేడర్ అసంతృప్తి..

మరోవైపు జనసేన అంతర్గత పరిస్థితులపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వంలో భాగస్వామ్యమైనప్పటికీ, కిందిస్థాయిలో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసుకునేందుకు జనసేన పెద్దగా దృష్టి సారించలేదనే విమర్శలున్నాయి. టీడీపీకున్న సంప్రదాయ ఓటు బ్యాంకు బలంతోనే గెలిచామని, స్వతహాగా పార్టీ నిర్మాణం క్షేత్రస్థాయిలో బలపడలేదని స్వయంగా జనసైనికులే చర్చించుకుంటున్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంలో ఎమ్మెల్యేలుగా గెలిచిన వారు కూడా పెద్దగా చేసిందేమీ లేదని భావిస్తున్నారు.



ముఖ్యంగా మంత్రులుగా ఉన్న నేతలు తమ అధికారాలను అనుభవించడానికే ప్రాధాన్యమిస్తున్నారు తప్ప, పార్టీ బలోపేతానికి సమయం కేటాయించడం లేదని జనసైనికులు ఇటీవల పవన్ కల్యాణ్ వద్దే నేరుగా వాపోయినట్లు సమాచారం.

## టీడీపీ కమిటీ ముందు బలనిరూపణ ఎలా?

క్షేత్రస్థాయిలో పటిష్టమైన యంత్రాంగం లేని పరిస్థితుల్లో.. టీడీపీ సీనియర్ నాయకుల కమిటీ ముందు జనసేన నేతలు తమ బలాన్ని ఎలా నిరూపించుకుంటారనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. తాము అడిగినన్ని స్థానాలు ఇవ్వడానికి టీడీపీ శ్రేణులు సిద్ధంగా ఉంటాయా లేదా అన్నది సందేహంగానే ఉంది. దీంతో రాబోయే రోజుల్లో సీట్ల సర్దుబాటు ప్రక్రియ రెండు పార్టీల మధ్య ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో వేచి చూడాల్సిందే. అయితే, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్సార్సీపీకి ఒక్క స్థానం కూడా దక్కకుండా చూడాలనే ఏకైక లక్ష్యంలో మాత్రం రెండు పార్టీల అగ్రనేతలు పూర్తి ఏకాభిప్రాయంతో ఉన్నట్లు స్పష్టమవుతోంది.

# బీసీ రిజర్వేషన్లపై రాజీలేని పోరాటం!

- స్థానిక సంస్థల్లో 34 శాతం సీట్లు సాధించడమే లక్ష్యం
- సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేస్తున్నామన్న మంత్రులు
- ఢిల్లీ ఏపీ భవన్‌లో రాష్ట్ర మంత్రుల సంయుక్త మీడియా సమావేశం
- ఎంపరికల్ డేటాతో ముందుకు వెళ్తున్నామన్న రామ్మోహన్ నాయుడు



**న్యూఢిల్లీ (స్పంద న్యూస్):** స్థానిక సంస్థల్లో బీసీలకు ముప్పై నాలుగు శాతం రిజర్వేషన్లు దక్కేలా రాష్ట్ర ప్రభుత్వం రాజీలేని పోరాటం చేస్తోందని మంత్రుల బృందం స్పష్టం చేసింది. బలహీన వర్గాల అభ్యున్నతి, సామాజిక న్యాయమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని వారు ఉద్ఘాటించారు. న్యూఢిల్లీలోని ఏపీ భవన్ గురజాడ కాన్ఫరెన్స్ హాల్‌లో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు (వ్యవసాయ శాఖ), కొలుసు పార్థసారథి (సమాచార, పౌర సంబంధాల శాఖ), అనగాని సత్యప్రసాద్ (రెవెన్యూ శాఖ) సంయుక్తంగా విలేకరుల సమావేశం నిర్వహించారు. బీసీ రిజర్వేషన్లపై యాభై శాతం పరిమితిని అధిగమించేందుకు తగిన ఎంపరికల్ డేటాతో సుప్రీంకోర్టులో న్యాయ పోరాటం చేస్తున్నామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పులను పూర్తిగా అధ్యయనం చేశామని, ఆ తీర్పుల ఆధారంగా న్యాయపరంగా వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తున్నామని ఆయన తెలిపారు. సుప్రీంకోర్టు ద్వారా బీసీలకు న్యాయం సాధించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని స్పష్టం చేశారు. బలహీన వర్గాల రిజర్వేషన్ల అంశంపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు, తదుపరి న్యాయ పోరాట వ్యూహాలపై చర్చించేందుకే తాము ముగ్గురం మంత్రుల బృందంగా ఢిల్లీకి వచ్చామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్రంలో బలహీన వర్గాలకు సామాజిక న్యాయం అందించడంతో పాటు వారికి రాజకీయ, ప్రజాస్వామ్య సాధికారత కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. వారికి ముప్పై నాలుగు శాతం రిజర్వేషన్లు సాధించాలనే పట్టుదలతో ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పుడూ రాష్ట్రం బాగుండాలని కోరుకుంటారని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. సీఎం ఢిల్లీ పర్యటనల నేపథ్యంలో విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. ప్రపంచం మెచ్చిన నాయకుడైన చంద్రబాబు.. ఎన్నో రాజకీయ ఇబ్బందులు ఎదురైనప్పటికీ రాష్ట్ర అభివృద్ధిని మాత్రమే ఆకాంక్షిస్తారని స్పష్టం చేశారు. అందుకే ఆయన ఇప్పటికే పలుమార్లు ఢిల్లీకి వచ్చారని మంత్రి వివరించారు. ఈ విలేకరుల సమావేశంలో ఏపీ భవన్ స్పెషల్ కమిషనర్ అర్జా శ్రీకాంత్ పాల్గొన్నారు.

# ఏపీకి భారీ పెట్టుబడి

**రూ. 6,700 కోట్లతో శ్రీ సిమెంట్స్ రాక**

**మూడు జిల్లాల్లో ప్లాంట్ల ఏర్పాటుకు సన్నాహాలు**

**ఏకంగా 3 వేల మందికి ఉపాధి అవకాశాలు**

**విశాఖలో మంత్రి టీజీ భరత్‌తో సంస్థ ప్రతినిధుల భేటీ**

**కర్నూలు (స్పంద న్యూస్):** రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి ఊతమిస్తూ ప్రముఖ సిమెంట్ తయారీ సంస్థ 'శ్రీ సిమెంట్స్ లిమిటెడ్' భారీ పెట్టుబడులతో ముందుకొచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు రూ. 6,700 కోట్ల పెట్టుబడితో తమ తయారీ యూనిట్లను విస్తరించేందుకు సంస్థ సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈ మేరకు విశాఖపట్నంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్‌తో సంస్థ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం సమావేశమై విస్తరణ ప్రణాళికలపై సమగ్రంగా చర్చించింది. రాష్ట్రంలో ఉన్న అనుకూల వాతావరణం, మౌలిక వనరులను దృష్టిలో ఉంచుకుని కడప, పల్నాడు, అనకాపల్లి జిల్లాల్లో యూనిట్లను నెలకొల్పేందుకు సంస్థ ప్రాధాన్యమిస్తోంది.



ఈ ప్రాజెక్టులు పట్టాలెక్కితే దాదాపు 3,000 మంది స్థానిక యువతకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి టీజీ భరత్ వెల్లడించారు. ఈ సమావేశంలో శ్రీ సిమెంట్స్ వైస్ చైర్మన్ ప్రశాంత్ బాబు, కార్పొరేట్ అఫైర్స్ ప్రెసిడెంట్ గౌరవ్ జైన్ తదితరులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్రంలో పారిశ్రామిక అనుకూల విధానాలు అమలవుతుండటంతో పలు బహుళజాతి, దేశీయ దిగ్గజ సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు క్యూ కడుతున్నాయని మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను, అనుమతులను ప్రభుత్వం వేగవంతంగా అందిస్తోందన్నారు. శ్రీ సిమెంట్స్ రాకతో రాయలసీమ, కోస్తాంధ్ర ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు మరింత పుంజుకుంటాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# తీరు మార్చుకోకుంటే ఖబడ్దార్!

**జగన్, వైసీపీ నేతలకు మంత్రి సవిత స్ట్రాంగ్ వార్నింగ్**

**గోరంట్ల (స్పంద న్యూస్):** "రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, అభివృద్ధిని అడ్డుకున్నా చూస్తూ ఊరుకోబోం.. తీరు మార్చుకోకుంటే సరైన సమయంలో మీ సంగతి తేలుస్తాం" అని మాజీ సీఎం జగన్, వైసీపీ నాయకులను రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తీవ్రస్థాయిలో హెచ్చరించారు. శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండల కేంద్రంలో మంగళవారం ఆమె టీడీపీ జిల్లా అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజుతో కలిసి అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి సవిత మాట్లాడుతూ.. ప్రతిపక్ష పార్టీ తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

## ఐదు రూపాయలకే కడుపునిండా భోజనం..

రాష్ట్రంలో పేదలు, కార్మికులకు కేవలం ఐదు రూపాయలకే రుచికరమైన, నాణ్యమైన భోజనం, అల్పాహారం అందించాలన్న ఉత్కృష్ట లక్ష్యంతో 2018లో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశారని మంత్రి సవిత గుర్తుచేశారు. సీఎం చంద్రబాబు పేదల కడుపు నింపితే.. ఆ తర్వాత వచ్చిన జగన్ వారి పొట్ట కొట్టారని మండిపడ్డారు. ప్రభుత్వ కార్యాలయాలకు వైసీపీ రంగులు, పథకాలకు తన పేరు పెట్టుకున్న జగన్.. కనీసం అన్న క్యాంటీన్లకు కూడా తనకు నచ్చిన పేరు పెట్టుకుని నడిపించాల్సిందని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రవ్యాప్తంగా 269 అన్న క్యాంటీన్లు ప్రారంభించి, కోట్లాది మంది ఆకలి తీరుస్తోందని వివరించారు.



సీఎం చంద్రబాబు స్ఫూర్తితో గతంలో పెనుకొండలో, ఇప్పుడు గోరంట్లలో తన సొంత నిధులతో అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేసినట్లు ఆమె వెల్లడించారు.

## జోడు గుర్రాల్లా అభివృద్ధి, సంక్షేమం..

సూపర్ సిక్స్ సహా ఇతర సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం జోడు గుర్రాల్లా పరుగులు పెట్టిస్తోందని మంత్రి సవిత తెలిపారు. ముఖ్యంగా రాయలసీమను అన్ని రంగాల్లో ముందు నిలిపేలా పెద్ద ఎత్తున పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నామన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిపై జగన్ గానీ, గొడ్డలి పార్టీ నాయకులు గానీ చర్చకు రావాలని ఆమె సవాల్ విసిరారు. సొంత పార్టీ కార్యకర్తలను, నాయకులను పొట్టనపెట్టుకున్న చరిత్ర ఆ గొడ్డలి పార్టీకే ఉందంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తే.. సరైన సమయంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఆ పార్టీ నాయకుల సంగతి తేలుస్తారని మంత్రి సవిత స్పష్టం చేశారు.

ప్రజాగళమే స్పంద జాతీయ తెలుగు దినపత్రిక



# భూమి ఉంది.. హక్కుకు అడ్డుగోడ!

## 22ఏ నిషేధ విముక్తిపై ప్రకటనలు.. అమలుపై ప్రశ్నలు

- ఆర్డీవోలకు అధికారాలు.. ప్రజలకు ఇంకా నిరీక్షణ
- డిస్పోజల్ లెక్కలే తప్ప.. రిజిస్ట్రేషన్ల లెక్క ఏది?
- ఫ్రీహోల్డ్ భూములకు ఊరట.. రికార్డుల అనుసంధానమే కీలకం
- స్పష్టత కరువైన 22ఏ మొత్తం విస్తీర్ణం




**భూ**మి చేతిలో ఉంది.. దానిపై లావాదేవీ చేసే అవకాశం కోసం మాత్రం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో 22ఏ నిషేధిత భూముల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం అధికారాల వికేంద్రీకరణ, ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్ల పునరుద్ధరణ, రికార్డుల సవరణ వంటి చర్యలు చేపట్టింది. కొన్ని ప్రాంతాల్లో దశాబ్దాల వివాదాలకు పరిష్కారం లభించింది. అయినా దరఖాస్తు స్వీకరణ నుంచి నిషేధ జాబితా తొలగింపు, రికార్డుల సవరణ, రిజిస్ట్రేషన్ వరకు ప్రక్రియ పూర్తయిందా అన్న ప్రశ్న మిగిలే ఉంది. ఉత్తర్వు రావడం, ఫైలు డిస్పోజ్ కావడం, ప్రజలకు భూమిపై లావాదేవీ అవకాశం లభించడం,మూడు వేర్వేరు దశలు.

అమరావతి, (స్పంద న్యూస్):

2024 జూన్ నుంచి 2026 సెప్టెంబర్ 7 వరకు మొత్తం 15,775 '22ఏ' విముక్తి దరఖాస్తులు రాగా.. అందులో 12,857 ఫైళ్లు డిస్పోజ్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. మరో 2,918 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అయితే, అనుకూల ఉత్తర్వులతో నిజంగా నిషేధ జాబితా నుంచి తొలగించిన దరఖాస్తులు, అలాగే తొలగింపు తర్వాత పూర్తయిన రిజిస్ట్రేషన్ దస్తావేజులకు సంబంధించిన రాష్ట్రవ్యాప్త ప్రత్యేక లెక్క అధికారికంగా ధ్రువీకరించబడలేదు. డిస్పోజ్ చేసినట్లు చూపుతున్న వాటిలో సుమారు 6,500 ఫైళ్లు వివిధ దశల్లో నిలిచిపోయాయన్న ఆరోపణలు ఉన్నాయి. వీటికి స్వతంత్ర అధికారిక ధ్రువీకరణ లేనందున.. 12,857 దరఖాస్తులకూ నిషేధ విముక్తి లభించిందని చెప్పడం సరికాదు. మరోవైపు సెప్టెంబర్ 10వ తేదీన సవరించిన ప్రక్రియ కింద 28,790 దరఖాస్తులు వచ్చినట్లు మంత్రి పేర్కొన్నారు. ఇది పై దరఖాస్తుల లెక్కతో ఒకే పరిధికి చెందినదో కాదో నిర్ధారణ లేదు. ఈ రెండింటినీ కలపడం లేదా వాటితో పరిష్కార శాతం లెక్కించడం ప్రజలను తప్పుదారి పట్టించేలా ఉంది.

### ఐదు వర్గాలకు ఊరట..

జనవరి 1న ప్రభుత్వం ఐదు భూ వర్గాలకు నిషేధ విముక్తి కల్పిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. అందులో మాజీ, ప్రస్తుత సైనికులకు కేటాయించిన భూములు, స్వాతంత్ర్య సమరయోధుల భూములు, రాజకీయ బాధితుల భూములు, 1954 జూన్ 18కి ముందు అసైన్ చేసిన భూములతో పాటు ప్రైవేటు పట్టా భూములు ఉన్నాయి. ఒక సర్వే నంబర్‌లో కొంత భాగానికే వివాదం ఉంటే మొత్తం విస్తీర్ణాన్ని నిలిపేయకుండా.. ఉపవిభజన చేసి, అర్హమైన మిగిలిన భాగాన్ని విడుదల చేయాలని ప్రభుత్వం సూచించింది. దరఖాస్తుదారుల నుంచి అనవసరంగా అనేక పత్రాలు కోరవద్దని మంత్రి స్పష్టం చేశారు. 2026 జూలై 22న జారీ చేసిన జీవో 444 ప్రకారం.. 22ఏ చేర్పు, తొలగింపు ప్రక్రియలో సంబంధిత ఆర్డీవో, సబ్ కలెక్టర్‌కు అధికారాలు ఇచ్చినట్లు సెప్టెంబర్ 15 హైకోర్టు తీర్పులో ప్రస్తావించారు. దేవాదాయ, వక్ఫ్ ఆస్తుల విషయంలో సంబంధిత సంస్థలతో ముందస్తు సంప్రదింపులు తప్పనిసరని పేర్కొన్నారు. ఆ తర్వాత 2026 సెప్టెంబర్ 15న వచ్చిన జీవో 588 ద్వారా అర్హమైన ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లకు ప్రభుత్వం మార్గం సుగమం చేసింది. చట్టప్రకారం ఇప్పటికే ప్రాసెస్ చేసిన 7,85,500 ఎకరాల అసైన్డ్ భూములు, తప్పుగా అసైన్డ్‌గా నమోదైన 5,422 ఎకరాల ప్రైవేటు పట్టా భూములకు రిజిస్ట్రేషన్ అవకాశం కల్పించారు. మరో 64,143 ఎకరాల అర్హత ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. అయితే ఇప్పటివరకు ఇచ్చిన మొత్తం 22ఏ జీవోలు, మెమోలు, సర్క్యులర్ల సంఖ్యను నిర్ధారించే అధికారిక సమగ్ర జాబితా లభించలేదు.

### క్షేత్రస్థాయిలో ఇంకా ఇబ్బందులే..

అధికారాలు డివిజన్ స్థాయికి వచ్చినప్పటికీ కొన్ని జిల్లాల్లో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల మౌఖిక ఆమోదం కోసం ఫైళ్లు ఆగిపోతున్నాయనే విమర్శలున్నాయి. కర్నూలులో 238, తిరుపతిలో 215, విశాఖలో 204 ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. ఫిబ్రవరి 13న జరిగిన శాసనసభ సమావేశాల్లో అధికార పక్ష ఎమ్మెల్యేలే భూ సమస్యల పరిష్కారంలో ఆలస్యాన్ని తీవ్రంగా ప్రశ్నించారు. పీజీఆర్ఎస్‌కు వచ్చిన ఫిర్యాదుల్లో 61 శాతం రెవెన్యూ శాఖకు సంబంధించినవేనని సాక్షాత్తూ మంత్రి తెలపడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ప్రజలు పదేపదే కార్యాలయాలకు రావాల్సి వస్తోందన్న అసంతృప్తి సభలోనూ ప్రతిబింబించింది. అయితే కొన్నిచోట్ల పరిష్కారం అందిన ఉదాహరణలూ ఉన్నాయి. వట్టిచెరుకూరు, పుల్లడిగుంట, ఏటుకూరు గ్రామాల్లో 41.46 ఎకరాలకు సంబంధించిన దీర్ఘకాల వివాదంలో 812 కుటుంబాలకు ప్రభుత్వం శాశ్వత పట్టాలు అందించింది.

### రాష్ట్రంలో భూమి లెక్క ఇదీ..

**2024-25 సామాజిక ఆర్థిక సర్వే ప్రకారం ఆంధ్రప్రదేశ్ భౌగోళిక విస్తీర్ణం 162.97 లక్షల హెక్టార్లు (సుమారు 4.03 కోట్ల ఎకరాలు). 2025-26 సర్వే వ్యవసాయ అధ్యాయం పేరుతో అందుబాటులో ఉన్న ప్రతిలో 2024-25 భూ వినియోగ గణాంకాలను పరిశీలిస్తే..**

నికర సాగు విస్తీర్ణం (చేపల సాగుతో కలిపి): 59.14 లక్షల హెక్టార్లు

అటవీ భూములు: 36.88 లక్షల హెక్టార్లు

వ్యవసాయేతర వినియోగంలోని భూమి: 21.01 లక్షల హెక్టార్లు

ప్రస్తుత పడావు భూములు: 14.60 లక్షల హెక్టార్లు

బంజరు, సాగుకు పనికిరాని భూములు: 13.35 లక్షల హెక్టార్లు

ఇతర పడావు భూములు: 10.39 లక్షల హెక్టార్లు

సాగుకు అనువైన నిరుపయోగ భూములు: 4.03 లక్షల హెక్టార్లు

శాశ్వత పచ్చిక, మేత భూములు: 2.03 లక్షల హెక్టార్లు

నికర సాగులో చేర్చని ఇతర వృక్ష పంటల భూములు: 1.54 లక్షల హెక్టార్లు

### రిజిస్ట్రేషన్ పూర్తైతేనే అసలైన ఫలితం!

రెవెన్యూ శాఖ నిర్ణయం, రిజిస్ట్రేషన్ శాఖ నిషేధ జాబితా, వెబ్ ల్యాండ్ రికార్డు ఈ మూడూ పరస్పరం సరిపోలాలి. తొలగింపు ఉత్తర్వు వచ్చినా సంబంధిత డేటాబేస్‌లో మార్పు అమలుకాకపోతే లావాదేవీలకు అడ్డంకి మిగిలే ఉంటుంది. రిజిస్ట్రేషన్ తర్వాత ఆటో మ్యుటేషన్ అమలులోకి తెచ్చినట్లు ప్రభుత్వం ప్రకటించింది. కానీ 22ఏ నుంచి తొలగించిన భూముల్లో ఎన్ని దస్తావేజులు నమోదయ్యాయి, ఎన్ని రెవెన్యూ రికార్డులు నవీకరించబడ్డాయి అన్న రాష్ట్రవ్యాప్త లెక్కలు ఎక్కడా ధ్రువీకరించబడలేదు. ప్రభుత్వం ప్రకటించే పురోగతి ప్రజలకు అర్థమయ్యేలా ప్రతి జిల్లాలో వచ్చిన దరఖాస్తులు, అనుకూల నిర్ణయాలు, తిరస్కరణలు, నిషేధ జాబితా నుంచి తొలగింపులు, పూర్తయిన రిజిస్ట్రేషన్ల వివరాలను విడిగా వెల్లడించాలి. భూమి విక్రయం లేదా బదిలీ కోసం ఎదురుచూస్తున్న కుటుంబానికి ఫైలు డిస్పోజల్ ఒక్కటే ఊరట ఇవ్వదు. అనుకూల ఉత్తర్వు ఫలితం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కనిపించినప్పుడే ఆ కుటుంబానికి భూహక్కుపై పూర్తి ప్రయోజనం చేకూరుతుంది.

# క్లీన్ ఎనర్జీ దిశగా అడుగులు!

**వినియోగదారులకు నిరంతరాయ విద్యుత్ సరఫరా**

**ఆరు లక్షల ఇళ్లపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు లక్ష్యం**

**ఎస్పీడీసీఎల్ సమీక్షలో మంత్రి గొట్టిపాటి రవికుమార్**

**తిరుపతి (స్పంద న్యూస్):** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రం క్లీన్ ఎనర్జీ దిశగా పయనిస్తోందని, వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. మంగళవారం తిరుపతిలోని ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో అధికారులతో ఆయన ముమ్మర సమీక్ష నిర్వహించారు. విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని, కాల్ సెంటర్లను మరింత బలోపేతం చేయాలని ఆయన అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు వంద గిగావాట్ల ఇంధన ఉత్పత్తి సామర్థ్యంతో ప్రాజెక్టుల నిర్మాణానికి ఒప్పందాలు జరిగాయని మంత్రి వెల్లడించారు. ఎల్నినో ప్రభావంతో జల విద్యుత్ ఉత్పత్తి తగ్గినప్పటికీ.. థర్మల్, సోలార్ విద్యుత్‌పై ఆధారపడుతూ ఆ కొరతను అధిగమిస్తున్నామన్నారు. సిబ్బంది కృషి వల్లే మెరుగైన సేవలందించగలుగుతున్నామని ప్రశంసించారు. సంస్థల్లో నెలకొన్న సిబ్బంది కొరతను తీర్చేందుకు త్వరలోనే ఆరు వందల ఇరవై తొమ్మిది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ) పోస్టులను భర్తీ చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. పీఎం సూర్యఘర్ పథకం కింద రాష్ట్రంలోని ఆరు లక్షల మంది ఎస్సీ, ఎస్టీ వినియోగదారుల గృహాలపై రూఫ్ టాప్ సోలార్ వ్యవస్థలను అమర్చే కార్యక్రమాన్ని సీఎం నిరంతరం సమీక్షిస్తున్నారని మంత్రి తెలిపారు. పనులను సకాలంలో పూర్తిచేయాలని, నిర్లక్ష్యం వహించే కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేవలం ఆరు నెలల వ్యవధిలోనే ఎస్సీ, ఎస్టీ గృహాలపై లక్ష సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేసి జాతీయ స్థాయిలో రాష్ట్రం నాలుగో స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. మరోవైపు పీఎం-కుసుమ్ పథకం ద్వారా ఫీడర్ల స్థాయిలో సోలరైజేషన్ పనులను వేగవంతం చేసి, రైతులకు పగటిపూటే తొమ్మిది గంటల విద్యుత్ అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. పునరుత్పాదక విద్యుత్ పంపిణీ పథకం (ఆర్డీఎస్ఎస్) కింద విద్యుత్ వ్యవస్థ బలోపేతం పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పనుల్లో నాణ్యతలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడొద్దని తేల్చిచెప్పారు. అనంతరం ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలో నలభై ఆరు మందికి కారుణ్య నియామక పత్రాలను మంత్రి అందజేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు రెండు వందల పదిహేను మందికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ ఉద్యోగులు మరింత బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి సంస్థను అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డితో పాటు ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్లు గురవయ్య, అయూబ్ ఖాన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# మహిళా సాధికారతే లక్ష్యం!

**ఐదు లక్షల మందిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతాం**

**స్వయం సహాయక సంఘాలకు ప్రాసెసింగ్ చార్జీల మాఫీ**

**బ్యాంక్ లింకేజీలో రికార్డు సృష్టించిన రాష్ట్రం**

**వీవోఏల భారం తగ్గించేందుకు ఈ-నారీ వ్యవస్థ: కొండపల్లి శ్రీనివాస్**



**అమరావతి (స్పంద న్యూస్):** మహిళా స్వయం సహాయక సంఘాలను కేవలం రుణాలు పొందే స్థాయికే పరిమితం కాకుండా.. ఉత్పత్తి, వ్యాపారం, మార్కెటింగ్ రంగాల్లో రాణించే గ్రామీణ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎస్ఎంఈ, సెర్ప్, ప్రవాసాంధ్రుల శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఉద్ఘాటించారు. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావిస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన తెలిపారు. ప్రతి కుటుంబంలో ఒకరిని పారిశ్రామికవేత్తగా తయారు చేయాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయమని మంత్రి వెల్లడించారు. ఇందులో భాగంగా రాబోయే ఆర్థిక సంవత్సరంలో (రెండు వేల ఇరవై ఆరు-ఇరవై ఏడు) రాష్ట్రవ్యాప్తంగా ఐదు లక్షల మందికి పైగా మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం పక్కా లక్ష్యంగా పెట్టుకుందని ఆయన ప్రకటించారు. దేశంలోనే రాష్ట్ర బ్యాంక్ లింకేజీ వ్యవస్థ అత్యుత్తమ స్థాయిలో ఉండటం గర్వకారణమని మంత్రి కొనియాడారు. రెండు వేల ఇరవై ఐదు-ఇరవై ఆరు ఆర్థిక సంవత్సరంలో ఏకంగా ముప్పై మూడు వేల ఆరు వందల పద్నాలుగు కోట్ల రూపాయల బ్యాంక్ లింకేజీ రుణాలు అందించి దేశంలోనే రాష్ట్రం సరికొత్త రికార్డు సృష్టించిందని, తద్వారా ప్రథమ స్థానంలో నిలిచిందని వివరించారు. ఇదే సమయంలో మహిళా సంఘాలకు ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. స్వయం సహాయక సంఘాల రుణాలపై బ్యాంకులు ఇప్పటివరకు వసూలు చేస్తున్న ప్రాసెసింగ్, ఇన్‌స్పెక్షన్, లెడ్జర్ ఫోలియో చార్జీలను పూర్తిగా ఎత్తివేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. ఈ నిర్ణయం వల్ల ఒక్కో సంఘానికి ఏడాదికి సుమారు ముప్పై రెండు వేల ఐదు వందల రూపాయల వరకు ఆర్థిక ప్రయోజనం కలుగుతుందని స్పష్టం చేశారు. రుణాల చెల్లింపుల్లో రాష్ట్రం అత్యుత్తమ ఫలితాలు సాధిస్తోందని మంత్రి ప్రశంసించారు. జాతీయ స్థాయిలో ఎన్‌పీఏ సగటు ఒకటి పాయింట్ ఏడు ఎనిమిది శాతం ఉండగా.. రాష్ట్రంలో అది కేవలం సున్నా పాయింట్ ఆరు ఏడు శాతంగానే ఉందని గుర్తుచేశారు. ఇది మహిళా సంఘాల ఆర్థిక క్రమశిక్షణకు నిదర్శనమని అభినందించారు. అలాగే ఇరవై మూడు కోట్లకు పైగా స్త్రీనిధి ప్రోత్సాహకాలను సైతం విడుదల చేశామని మంత్రి వెల్లడించారు. క్షేత్రస్థాయిలో అహర్నిశలు శ్రమిస్తున్న విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ల (వీవోఏ) పనిభారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. వారి కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలుగా 'ఈ-నారీ' వ్యవస్థను ప్రవేశపెట్టామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆధునిక సాంకేతికతను విస్తృతంగా వినియోగించడం ద్వారా మహిళా సంఘాల లావాదేవీల్లో మరింత పారదర్శకత, వేగం పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# చంద్రబాబు నాటకాలు

**బీసీలను మోసగించేందుకే కొత్త డ్రామా**

**సీఎంపై మాజీ మంత్రి వేణుగోపాల కృష్ణ ఫైర్**

**కోర్టుల ముందు బట్టబయలైన ద్రోహం**

**34 శాతం హామీ ఇచ్చి కాలక్షేపం చేస్తున్న వైనం**

**2018లో స్థానిక ఎన్నికలు ఎందుకు పెట్టలేదో చెప్పాలి**



**తాడేపల్లి (స్పంద న్యూస్):** బీసీ వర్గాలను మరోసారి మోసగించేందుకు ఢిల్లీ వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొత్త నాటకాలకు తెరలేపారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆదివారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజర్వేషన్ల వ్యవహారంపై న్యాయస్థానాలు ప్రశ్నించడంతో బీసీలకు చంద్రబాబు చేసిన ద్రోహం పూర్తిగా బట్టబయలైందని వేణుగోపాల కృష్ణ విమర్శించారు. ప్రజల ముందు దోషిగా నిలబడలేక ఇప్పుడు ఢిల్లీలో బీసీ మంత్రులతో అబద్ధాలు చెప్పిస్తూ మరో కొత్త డ్రామాకు తెరలేపారని ఎద్దేవా చేశారు. గతంలో న్యాయస్థానం తీర్పును అనుసరించే వైఎస్సార్సీపీ ఎన్నికలకు వెళ్ళిందని ఆయన గుర్తుచేశారు. 34 శాతం రిజర్వేషన్లను 24 శాతానికి కుదించడానికి వైఎస్ జగన్ కారణమంటూ వెన్నుపోటు పార్టీ నాయకులు చేస్తున్న ప్రచారం పూర్తిగా పచ్చి అబద్ధమని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల పేరుతో చంద్రబాబు చేస్తున్న మోసపూరిత రాజకీయాలు, టీడీపీ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారంపై ఆయన తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరగకపోతే రూ. 7 వేల కోట్ల నిధులు రావని చెబుతూ.. ఆ నెపాన్ని వైఎస్సార్సీపీపై నెట్టే ప్రయత్నం చేయడం పట్ల మాజీ మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. 2018లో స్థానిక సంస్థల ఎన్నికలు ఎందుకు నిర్వహించలేదని, ఆనాడు ఎన్నికలు నిర్వహించకపోతే 15వ ఆర్థిక సంఘం నిధులు రావని తెలియదా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. 34 శాతం బీసీ రిజర్వేషన్లతో ఎన్నికలకు వెళ్తామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చి.. తీరా అధికారంలోకి వచ్చాక ఆ హామీని అమలు చేయకుండా ఢిల్లీ పర్యటనలు, జీవోలు, ప్రకటనల పేరుతో కాలక్షేపం చేస్తున్నారని వేణుగోపాలకృష్ణ ధ్వజమెత్తారు.

# చారిత్రాత్మక మైలురాయి!

**వంద కోట్లు దాటిన మహిళల ఉచిత ప్రయాణాలు**

**కూటమి ప్రభుత్వ 'స్త్రీ శక్తి' పథకానికి అపూర్వ స్పందన**

**మహిళలకు 3,550 కోట్ల మేర ఆదా అయిన ప్రయాణ ఖర్చు**

**హర్షం వ్యక్తం చేసిన రవాణా శాఖ మంత్రి మండిపల్లి**

**ఆర్థిక భారం పడుతున్నా ఆర్టీసీకి నిధులు చెల్లిస్తున్న సర్కారు**

**తాడేపల్లి (స్పంద న్యూస్):** రాష్ట్రంలో మహిళల కోసం కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'స్త్రీ శక్తి' ఉచిత బస్సు ప్రయాణ పథకం అపూర్వ విజయం సాధిస్తూ చారిత్రాత్మక మైలురాయిని చేరుకుంది. ఈ పథకం కింద 100 కోట్ల ఉచిత ప్రయాణాలు విజయవంతంగా పూర్తి కావడం పట్ల రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. మహిళామూర్తులకు ఆర్థిక భరోసా కల్పించడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని ఆయన ఉద్ఘాటించారు. ఆదివారం తాడేపల్లిలో ఆయన ఈ పథకం అమలు తీరును వివరించారు. మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రారంభించిన స్త్రీ శక్తి పథకానికి రాష్ట్రవ్యాప్తంగా అపూర్వమైన స్పందన లభిస్తోందని మంత్రి తెలిపారు. గతేడాది ఆగస్టు 15న ప్రారంభమైన ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 100 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు నమోదుకావడం పథకం ఘన విజయానికి నిదర్శనమన్నారు. ప్రతిరోజూ సగటున 24 లక్షల మంది మహిళలు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారని వెల్లడించారు. ఈ పథకం ద్వారా ఇప్పటివరకు మహిళలకు సుమారు 3,550 కోట్ల రూపాయల మేర ప్రయాణ ఖర్చు ఆదా అయ్యిందని, వారికి గొప్ప ఆర్థిక స్వేచ్ఛ లభించిందని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కేవలం హామీలుగా గాలికొదిలేయకుండా.. ఒక బాధ్యతగా భావించి అమలు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని మంత్రి మండిపల్లి స్పష్టం చేశారు. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం ద్వారా ప్రభుత్వంపై ఆర్థికంగా కొంత భారం పడుతున్నప్పటికీ.. మహిళల సంక్షేమం విషయంలో వెనుకడుగు వేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ పథకాన్ని ఎంతో సమర్థవంతంగా కొనసాగిస్తున్నారని కొనియాడారు. ఉచిత ప్రయాణాల కారణంగా ఆర్టీసీపై నెలకు సుమారు 160 కోట్ల రూపాయల మేర భారం పడుతోందని మంత్రి తెలిపారు. అయినప్పటికీ ఇప్పటివరకు ప్రభుత్వం 2,160 కోట్ల రూపాయలను ఆర్టీసీకి చెల్లించడం ద్వారా పథకం అమలుకు పూర్తి సహకారం అందిస్తోందని వివరించారు. ప్రభుత్వానికి ఇదొక భారంగా భావించకుండా, మహిళల సంక్షేమం కోసం తమ బాధ్యతగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని మంత్రి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు.

# విజయవాడ ఉత్సవ్‌కు రండి!

**తమిళనాడు సీఎంకు ఏపీ ఎంపీల ఆహ్వానం**




**చెన్నై (స్పంద న్యూస్):** ఈ నెల 11వ తేదీ నుంచి విజయవాడలో అత్యంత ఘనంగా నిర్వహించనున్న 'విజయవాడ ఉత్సవ్-2026' వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని తమిళనాడు ముఖ్యమంత్రి టి.ఎస్. జోసెఫ్ విజయ్‌కు ప్రత్యేక ఆహ్వానం అందింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోరిక మేరకు రాష్ట్రానికి చెందిన పలువురు పార్లమెంట్ సభ్యులు చెన్నైలోని సీఎం కార్యాలయానికి వెళ్లి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. అక్టోబర్ 11 నుంచి 20వ తేదీ వరకు పది రోజుల పాటు విజయవాడ వేదికగా ఈ ఉత్సవాలు జరగనున్నాయి. ఈ వేడుకలకు తప్పకుండా విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రతినిధుల బృందం తమిళనాడు ముఖ్యమంత్రిని కోరింది. ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్, అమలాపురం పార్లమెంట్ సభ్యులు జి.ఎం.సి. హరీష్ బాలయోగి, విజయవాడ ఉత్సవ్ కమిటీ చైర్మన్ కె. మురళి కలిసి తమిళనాడు గౌరవ ముఖ్యమంత్రి టి.ఎస్. జోసెఫ్ విజయ్‌కు ఈ ఆహ్వాన పత్రాన్ని స్వయంగా అందజేశారు.

ప్రజాగళమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక





# ప్రపంచాన్ని వదలని మహమ్మారులు!?

## కరోనా పీడకల మరువకముందే.. సైబీరియాలో 'ప్లేగు' అనుమానాలు

## యాంటీ ప్లేగు పరిశోధన కేంద్రం ఉద్యోగిని మృతితో కలకలం

## వందల మందిపై వైద్య నిఘా.. ఆస్పత్రుల్లో క్వారంటైన్ చర్యలు

## 'న్యుమోనిక్ ప్లేగు' అంటూ ప్రచారం.. ఇంకా నిర్ధారణ కాలేదంటున్న రష్యా

కరోనా మిగిల్చిన చేదు జ్ఞాపకాలు ఇంకా ప్రపంచాన్ని వెంటాడుతూనే ఉన్నాయి. ఎబోలా వంటి ప్రాణాంతక అంటువ్యాధులు వివిధ ప్రాంతాలను కలవరపెడుతుండగా.. ఇప్పుడు రష్యాలోని సైబీరియాలో చోటుచేసుకున్న ఓ అనుమానాస్పద మరణం మరోసారి ప్రపంచ ఆరోగ్య వర్గాల దృష్టిని ఆకర్షించింది. ఇర్కుట్స్క్ యాంటీ ప్లేగు రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో పనిచేసే 28 ఏళ్ల డారియా షిపిలోవా తీవ్ర న్యుమోనియాతో అక్టోబర్ 2న మృతి చెందారు. ఆమెకు న్యుమోనిక్ ప్లేగు సోకిందనే అనుమానాలు ప్రచారంలోకి రావడంతో ముందుజాగ్రత్తగా పెద్ద సంఖ్యలో ఆమెతో సంబంధం ఉన్నవారిని వైద్య పర్యవేక్షణలో ఉంచారు. అయితే ఇది ప్లేగు వ్యాప్తేనని ఇప్పటివరకు అధికారికంగా నిర్ధారణ కాలేదు.

### టెస్ట్‌ట్యూబ్ పగిలిందా..?

డారియా పనిచేస్తున్న ప్రయోగశాలలో ప్లేగుకు కారణమయ్యే బ్యాక్టీరియా ఉన్న టెస్ట్‌ట్యూబ్ ప్రమాదవశాత్తూ పగిలిందని, ఆ తర్వాతే ఆమె అస్వస్థతకు గురయ్యారంటూ స్థానిక, స్వతంత్ర మీడియా కథనాలు వెలువడ్డాయి. అయితే ఈ కథనాన్ని రష్యా ఆరోగ్య అధికారులు ధ్రువీకరించలేదు. ప్రయోగశాలలో ప్రమాదకర సూక్ష్మజీవులకు సంబంధించిన ప్రమాదం నమోదైనట్లు ఆధారాలు లేవని రష్యా ప్రజారోగ్య సంస్థ రోస్పోట్రెబ్నాడ్జోర్ తెలిపింది. డారియా మరణానికి కారణాన్ని ప్రస్తుతం 'కారణం నిర్ధారణ కాని న్యుమోనియా'గా పేర్కొంది. ఈ ఘటన తర్వాత ఇన్‌స్టిట్యూట్‌లోని 60 మందికి పైగా సిబ్బందిని ఐసోలేషన్‌లో ఉంచినట్లు వార్తలు వచ్చాయి. ఇర్కుట్స్క్, షెలెఖోవ్ ప్రాంతాల్లోని పలు ఆస్పత్రుల్లోనూ క్వారంటైన్ చర్యలు చేపట్టారు. డారియాతో సంబంధం ఉన్న వారిని గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు ఆమెతో సంబంధం ఉన్నవారిలో కొత్త ప్లేగు కేసులు నిర్ధారణ కాలేదని అధికారులు వెల్లడించారు.

### 'ప్లేగు' మాటతో ఉలిక్కిపాటు

పొరుగున ఉన్న బురియాటియా అధినేత అలెక్సీ సిడెనోవ్ తొలుత డారియా ప్లేగుతో మరణించినట్లు పేర్కొని.. ఆ తర్వాత దానిని 'ప్లేగు కావచ్చు'గా సవరించడంతో అనుమానాలు మరింత పెరిగాయి. మరోవైపు ఇర్కుట్స్క్ ప్రాంతీయ అధికారులు పరిస్థితి అదుపులోనే ఉందని, పర్యవేక్షణలో ఉన్నవారిలో వ్యాధి లక్షణాలు కనిపించడం లేదని చెబుతున్నారు. రోస్పోట్రెబ్నాడ్జోర్ అధిపతి అన్నా పోపోవా స్వయంగా ఇర్కుట్స్క్‌కు వెళ్లి పరిస్థితిని సమీక్షించారు.

### అమెరికా నిఘా

సైబీరియాలో చోటుచేసుకున్న పరిణామాలను అమెరికా కూడా గమనిస్తోంది. అనుమానిత న్యుమోనిక్ ప్లేగు కేసుకు సంబంధించిన వార్తలు తమ దృష్టికి వచ్చాయని, అమెరికా వ్యాధి నియంత్రణ సంస్థతోపాటు ఇతర విభాగాలు పరిస్థితిని పరిశీలిస్తున్నాయని అమెరికా విదేశాంగ శాఖ తెలిపింది. రష్యా అధికారులు కచ్చితమైన సమాచారాన్ని వేగంగా, పారదర్శకంగా వెల్లడించాలని కోరింది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నామని, ప్రస్తుతానికి తీవ్ర భయాందోళనకు కారణమని భావించడం లేదని పేర్కొన్నారు.

### న్యుమోనిక్ ప్లేగు అంటే..?

ప్లేగుకు కారణమయ్యే బ్యాక్టీరియా పేరు యెర్సినియా పెస్టిస్. బుబోనిక్, సెప్టిసిమిక్, న్యుమోనిక్ రూపాల్లో ఈ వ్యాధి కనిపించవచ్చు. ఇందులో ఊపిరితిత్తులను ప్రభావితం చేసే న్యుమోనిక్ ప్లేగు తీవ్ర రూపం. బాధితుడితో సన్నిహితంగా ఉన్నప్పుడు శ్వాస బిందువుల ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే అవకాశం ఉంటుంది. జ్వరం, దగ్గు, ఛాతీలో నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపించవచ్చు. అయితే సకాలంలో గుర్తించి సరైన యాంటీబయాటిక్ చికిత్స అందిస్తే ప్లేగును నయం చేయవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతానికి సైబీరియాలో 'ప్లేగు మహమ్మారి మొదలైంది' లేదా 'భయానకంగా విస్తరిస్తోంది' అని చెప్పడానికి ఆధారాలు లేవు. ఒక అనుమానాస్పద మరణంపై విచారణ కొనసాగుతుండగా, ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా క్వారంటైన్, వైద్య పర్యవేక్షణ చేపట్టారు. అందువల్ల అధికారిక పరీక్షల ఫలితాలు వెలువడే వరకు వదంతులకు బదులుగా ధ్రువీకరించిన సమాచారాన్నే పరిగణనలోకి తీసుకోవడం కీలకం.




# బ్రో.. రాజీనామా సమయం వచ్చింది

- ఎవ్వరూ తప్పించుకోలేరు!
- ఓటర్ల జాబితా వివాదంపై రాహుల్ గాంధీ ఘాటు హెచ్చరిక
- జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా కోరుతూ ఎన్నికల సంఘం కార్యాలయానికి విపక్షాల మార్చ్
- మార్గమధ్యంలో అడ్డుకున్న పోలీసులు.. రోడ్డుపైనే ఎంపీల ధర్నా
- 'ప్రజాప్రతినిధులమైన మమ్మల్ని ఎందుకు అడ్డుకుంటున్నారు?' అంటూ రాహుల్ ప్రశ్న







**న్యూఢిల్లీ, అక్టోబర్ 6 (స్పంద న్యూస్):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో అవకతవకలు జరిగాయంటూ విపక్షాలు చేస్తున్న ఆరోపణలపై రాజకీయ పోరు మరింత ముదిరింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి ఎంపీలు మంగళవారం పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం వైపు భారీ మార్చ్ చేపట్టారు. పోలీసులు మార్గమధ్యంలోనే వారిని అడ్డుకోవడంతో ఎంపీలు అక్కడే బైఠాయించారు. ఈ సందర్భంగా లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ.. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలకు బాధ్యులైనవారెవరూ తప్పించుకోలేరంటూ హెచ్చరించారు. అయితే ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయన్నవి విపక్షాల ఆరోపణలు కాగా, ఎన్నికల సంఘం వాటిని తిరస్కరిస్తోంది.

### 'మేం ప్రజల ప్రతినిధులం'

దాదాపు 300 మంది లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు ప్రధాన ఎన్నికల కమిషనర్‌తోపాటు మిగతా ఇద్దరు ఎన్నికల కమిషనర్లను కలిసేందుకు వచ్చారని రాహుల్ పేర్కొన్నారు. ఎన్నికల సంఘం కార్యాలయం సమీపంలోనే ఉన్నప్పటికీ తమను ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. తాము ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్నామని, ఎన్నికల కమిషనర్లను కలిసేందుకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ నుంచి బయలుదేరిన విపక్ష ఎంపీలను నీతి ఆయోగ్, ఆకాశవాణి భవన్ మధ్య ప్రాంతంలో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా సహా పలువురు నేతలు రోడ్డుపైనే ధర్నాకు దిగారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ నేతలు అభిషేక్ బెనర్జీ, డెరిక్ ఓబ్రెయిన్‌తోపాటు పలువురు నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాహుల్, ప్రియాంకను కూడా కొద్దిసేపు అదుపులోకి తీసుకున్నట్లు వార్తా సంస్థలు వెల్లడించాయి.

### 'జ్ఞానేశ్.. రాజీనామా సమయం వచ్చింది'

నిరసన సమయంలో రాహుల్ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సామాజిక మాధ్యమంలో 'జ్ఞానేశ్.. అంతా అయిపోయింది బ్రో.. రాజీనామా చేయాల్సిన సమయం వచ్చింది' అంటూ పోస్ట్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్, జ్ఞానేశ్‌కుమార్‌లపై కూడా రాహుల్ ఆరోపణలు చేశారు. ఎన్నికల వ్యవస్థను దెబ్బతీసేందుకు వీరంతా కలిసి పనిచేస్తున్నారని ఆరోపిస్తూ, బాధ్యులెవరూ తప్పించుకోలేరని హెచ్చరించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకే తమ పోరాటమని పేర్కొన్నారు. ఇవి రాహుల్ చేసిన రాజకీయ ఆరోపణలు మాత్రమే; అవి నిర్ధారిత అక్రమాలుగా తేలలేదు.

### బీజేపీ ఎదురుదాడి

విపక్షాల నిరసనపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. ఎన్నికల ఓటములపై నిరాశతో కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు రాజ్యాంగ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నాయని కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ విమర్శించారు. మరోవైపు ప్రత్యేక సమగ్ర సవరణలో అక్రమాలు జరిగాయన్న విపక్షాల ఆరోపణలను ఎన్నికల సంఘం తిరస్కరిస్తూ, సంబంధిత నిర్ణయాలు కమిషన్‌లో ఏకగ్రీవంగానే తీసుకున్నట్లు చెబుతోంది.



# న్యూట్రినో పరిశోధనలకు నోబెల్!



- భౌతిక శాస్త్రంలో ప్రొఫెసర్ ఫ్రాన్సిస్ హాల్జెన్‌కు అత్యున్నత పురస్కారం
- అత్యధిక శక్తిగల ఖగోళ న్యూట్రినోల గుర్తింపులో విశేష కృషి

**స్టాక్‌హోమ్, అక్టోబర్ 6 (స్పంద న్యూస్):** విశ్వం లోతుల్లో దాగున్న రహస్యాలను న్యూట్రినోల ద్వారా ఛేదించేందుకు సాగించిన అసాధారణ పరిశోధనలకు అత్యున్నత గౌరవం దక్కింది. అత్యధిక శక్తిగల ఖగోళ న్యూట్రినోల ఆవిష్కరణలో కీలక పాత్ర పోషించిన ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఫ్రాన్సిస్ హాల్జెన్‌ను ఈ ఏడాది భౌతిక శాస్త్ర నోబెల్ బహుమతి వరించింది. అంటార్కిటికాలోని దక్షిణ ధ్రువం వద్ద మంచు పొరల లోతుల్లో ఏర్పాటు చేసిన ప్రఖ్యాత 'ఐస్‌క్యూబ్ న్యూట్రినో అబ్జర్వేటరీ' రూపకల్పన, అభివృద్ధి, పరిశోధనలకు హాల్జెన్ నాయకత్వం వహించారు. విశ్వంలోని అత్యంత సుదూర ప్రాంతాల నుంచి భూమిని చేరుతున్న అధిక శక్తిగల న్యూట్రినోలను గుర్తించడంలో ఈ పరిశోధన కేంద్రం కీలకంగా మారింది. న్యూట్రినోలు అత్యంత సూక్ష్మమైన కణాలు. పదార్థంతో చాలా అరుదుగా పరస్పర చర్య జరపడం వల్ల వాటిని గుర్తించడం అత్యంత క్లిష్టం. అందుకే వీటిని 'ఘోస్ట్ పార్టికల్స్' అని కూడా పిలుస్తుంటారు. అంటార్కిటికా మంచు పొరల్లో వేలాది కాంతి సెన్సర్లను ఏర్పాటు చేసి న్యూట్రినోల జాడను పట్టుకునే భారీ పరిశోధనా వ్యవస్థను రూపొందించడంలో హాల్జెన్ కీలక పాత్ర పోషించారు. 'ఐస్‌క్యూబ్' ద్వారా అత్యధిక శక్తిగల ఖగోళ న్యూట్రినోలను గుర్తించడం వల్ల విశ్వంలోని అత్యంత శక్తిమంతమైన ఖగోళ పరిణామాలను అధ్యయనం చేసేందుకు కొత్త మార్గం తెరుచుకుంది. బ్లాక్‌హోల్స్, నక్షత్రాల పరిణామం, అత్యంత శక్తివంతమైన ఖగోళ మూలాలపై మరింత లోతైన పరిశోధనలకు ఇది దోహదపడుతోంది. కాంతి, రేడియో తరంగాలు, ఇతర సంప్రదాయ పద్ధతులతో విశ్వాన్ని పరిశీలించడంతోపాటు న్యూట్రినోల ఆధారంగా ఖగోళాన్ని అధ్యయనం చేసే కొత్త అవకాశాన్ని 'ఐస్‌క్యూబ్' కల్పించింది. హాల్జెన్ పరిశోధనలు న్యూట్రినో ఖగోళ శాస్త్రాన్ని కొత్త స్థాయికి తీసుకెళ్లాయని నోబెల్ కమిటీ ప్రశంసించింది.

# రవాణాకు 'ఐటీఎల్ఏ'

## చిన్న పరిశ్రమలకు రూ.10 వేల కోట్ల బూస్ట్!



- కేంద్ర కేబినెట్‌లో కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర
- సమగ్ర రవాణా, లాజిస్టిక్స్ ప్రణాళికకు ప్రత్యేక అథారిటీ
- పదేళ్లు, అంతకుమించిన కాలానికి జాతీయ రవాణా మాస్టర్ ప్లాన్
- రూ.500 కోట్లకు పైబడిన మౌలిక ప్రాజెక్టులకు సాంకేతిక మదింపు
- చిన్న, మధ్యతరహా సంస్థల వృద్ధికి దీర్ఘకాలిక పెట్టుబడి నిధి

**న్యూఢిల్లీ, అక్టోబర్ 6 (స్పంద న్యూస్):** దేశంలో రవాణా, లాజిస్టిక్స్ వ్యవస్థను ఒకే గొడుగు కింద సమన్వయం చేయడంతోపాటు చిన్న, మధ్యతరహా సంస్థలకు దీర్ఘకాలిక పెట్టుబడి ఊతమిచ్చే రెండు కీలక నిర్ణయాలకు కేంద్ర కేబినెట్ మంగళవారం ఆమోదముద్ర వేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో 'ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ లాజిస్టిక్స్ అథారిటీ' ఏర్పాటుతోపాటు రూ.10 వేల కోట్ల 'ఎస్ఎంఈ గ్రోత్ ఫండ్'కు ఆమోదం తెలిపారు.

### రవాణా రంగాలన్నీ ఒకే ప్రణాళికలో..

రోడ్లు, రైల్వేలు, పోర్టులు, విమానయానం, అంతర్గత జలమార్గాలు, తీరప్రాంత రవాణా, పట్టణ రవాణా, లాజిస్టిక్స్ రంగాల మధ్య సమన్వయం పెంచడమే ఐటీఎల్ఏ ప్రధాన లక్ష్యం. ప్రత్యేక ప్రయోజన సంస్థగా దీనిని ఏర్పాటు చేయనున్నారు. దేశంలో సమగ్ర రవాణా, లాజిస్టిక్స్ ప్రణాళికకు అత్యున్నత సంస్థగా ఇది వ్యవహరించనుంది. పరిశోధన, ప్రణాళిక, ప్రాజెక్టుల మదింపు, పర్యవేక్షణ, ప్రభావ అంచనా వంటి బాధ్యతలను నిర్వర్తిస్తుంది. పదేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలాన్ని దృష్టిలో పెట్టుకుని సమగ్ర 'జాతీయ రవాణా మాస్టర్ ప్లాన్'ను ఐటీఎల్ఏ రూపొందించనుంది. వివిధ రవాణా శాఖల ఐదేళ్ల ప్రణాళికలు, వార్షిక ప్రణాళికలను కూడా ఈ మాస్టర్ ప్లాన్‌తో అనుసంధానించేలా పరిశీలిస్తుంది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన రూ.500 కోట్లకు పైబడిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు సాంకేతిక మదింపు చేయడంతోపాటు వాటి అమలును పర్యవేక్షించనుంది. రవాణా రంగానికి సంబంధించిన వివిధ గణాంకాలను ఒకేచోట అందుబాటులోకి తీసుకొచ్చేందుకు 'జాతీయ రవాణా డేటా రిపాజిటరీ'ని కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ-వే బిల్లులు, ఫాస్టాగ్, వాహన్, జీపీఎస్, పట్టణ ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థల సమాచారాన్ని అనుసంధానించి ప్రణాళికలు, ప్రాజెక్టుల పర్యవేక్షణకు వినియోగించనున్నారు.

చిన్న పరిశ్రమలకు రూ.10 వేల కోట్ల నిధి

చిన్న, మధ్యతరహా సంస్థల వృద్ధికి రూ.10 వేల కోట్ల ప్రభుత్వ పెట్టుబడితో 'ఎస్ఎంఈ గ్రోత్ ఫండ్' ఏర్పాటుకూ కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 2026--27 కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన ఈ నిధి ద్వారా వృద్ధి సామర్థ్యం ఉన్న చిన్న, మధ్యతరహా సంస్థలకు దీర్ఘకాలిక ఈక్విటీ పెట్టుబడులు అందించనున్నారు. తయారీ రంగంలోని సంస్థలకు ప్రధానంగా ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు సేవలు, సాంకేతికత, ఆవిష్కరణలు, వ్యూహాత్మక విలువ గొలుసులకు సంబంధించిన సంస్థలకు కూడా నిధి ద్వారా మద్దతు ఇవ్వనున్నారు.

ప్రజాగళమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక
బుధవారం, 7 అక్టోబర్ 2026

## అంగన్వాడి పోషణ మహా ఉత్సవాలు



కాకుమాను అక్టోబర్ 6 (స్పంద న్యూస్): మండల పరిధిలోని గరికపాడు అంగనవాడి మెయిన్ సెంటర్‌లో అంగన్వాడి పోషణ మహా ఉత్సవాలు ఐసిడిసి పాంద్రపాడు సూపర్వైజర్ ప్రేమలత ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో జి. వీరస్వామి పాల్గొన్నానీ ఆయన మాట్లాడుతూ అంగనవాడి పిల్లలకు మొదటి మెట్టు భారతదేశంలో అమలవుతున్నాయి. అంగనవాడి వ్యవస్థ ప్రతిష్టాత్మక అయినది పిల్లలకు మంచి ఆహారం మంచి విద్య ఆటలు పాటలు అంగన్వాడి నుండి మొదలవుతాయి అన్నారు. అంగనవాడి నుండి చదివిన పిల్లలు ఉన్నత స్థాయిలో ఉన్నారు అన్నారు.అనంతరం గ్రామంలో ఉన్న అన్ని అంగనవాడి టీచర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ సరిత, గ్రామ సచివాలయం సిబ్బంది, గ్రామ పెద్దలు, బిజెపి మండల నాయకులు, పాంద్రపాడు సెక్టర్ సూపర్వైజర్ ప్రేమలత సన్మాన కార్యక్రమం నిర్వహించారు అంగన్వాడి టీచర్ బి. మరియమ్మ ఏ. సుజాత కే .సుజాత లావణ్య వెంకయ్యమ్మ పాల్గొన్నారు.

## కామన్ వెల్త్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షానూన్ కు ఘన సన్మానం



తెనాలి, అక్టోబర్06(స్పంద న్యూస్) : స్థానిక చెంచుపేటలోని మార్గ అపార్ట్మెంట్ లో మంగళవారం పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ మధిర షానూన్ గృహం నందు పలువురు స్వచ్ఛంద సేవా సంస్థ నాయకులు,మార్తా గ్రూప్ ఆఫ్ నర్సింగ్ ఇన్స్టిట్యూషన్స్ అధినేత యనమల ఈశ్వర్ బృందం మధిర షానూన్ ను ఘనంగా సన్మానించారు.ఈసందర్భంగా మార్తా గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూ షన్స్ అధినేత యనమల ఈశ్వర్ మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలలో 4 ఇంటర్నేషనల్ అవార్డులు అందుకున్నందుకు, ప్రత్యేకంగా కామన్ వెల్త్ పవర్ లిఫ్టింగ్ లో సిల్వర్ మెడల్ మరియు బెస్ట్ లిఫ్టర్ టైటిల్ సాదించి నందుకు సంతోషంగా ఉందని, రాబోవు రోజుల్లో భారతదేశం తరుపున అనేక అవార్డులు సాధించాలని కోరారు. మధిర షానూన్ మాట్లాడుతూ కరోనా ముందు బ్యాడ్మింటన్ లో రాణించానని కరోనా తర్వాత జిమ్ కోచ్ సాయి రేవతి సూచన మేరకు 2023 నుండి పవర్ లిఫ్టింగ్ ఆడుతున్నానని 2023 నుండి ఇప్పటివరకు ఇంటర్నేషనల్ లో 4 మెడల్స్, నేషనల్ లెవెల్ లో 5 ఐదుసార్లు రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి లో 15 కు పైగా అవార్డులు పొందుకున్నానని అందుకు సహకరించిన తల్లిదండ్రులకు కోచ్ పూసపాటి శివరామ కిరణ్ రాజ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు.షానూన్ తల్లిదండ్రులు మాట్లాడుతూ షానూన్ ఇంటర్నేషనల్ అవార్డు పొందుకోవటం మాకు ఎంతో గర్వంగా ఉందని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఆర్.యన్.ఫౌండేషన్ చైర్మన్ పల్లె శామ్యూల్ , ప్రభాకర్, ఫ్రెండ్స్ ఫరెవర్ చైర్మన్ సముద్రాల రాజేష్, అగాపేలవ్ చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ పల్లికొండ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చిరస్మరణీయులు ఫోటోగ్రాఫర్ రమేష్ బాబు



తెనాలి, అక్టోబర్06(స్పంద న్యూస్) : వీడియో గ్రాఫర్స్ అండ్ ఫోటో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సీనియర్ నాయకులు కర్ర రమేష్ బాబు 20వ వర్ధంతిని మంగళవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. స్థానిక రైల్వే స్టేషన్ ఎదురు శివలింగేశ్వర స్వామి భక్త బృందం వేదిక వద్ద పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ అసోసియేషన్ సీనియర్ నాయకులు కీర్తిశేషులు కర్ర రమేష్ బాబు,లక్ష్మీ స్టూడియో అండ్ వీడియో అధినేతగా, సీనియర్ వీడియో గ్రాఫర్ అండ్ ఫోటోగ్రాఫర్ గా, అసోసియేషన్ అభివృద్ధికి కీలకంగా వ్యవహరించారని, ఎంతోమందికి ఫోటోగ్రఫీ లో శిక్షణ ఇచ్చి ఫోటోగ్రాఫర్లుగా తయారు చేశారని, ఆయన చేసిన సేవలు మరువరానివని అన్నారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు శుద్ధపల్లి సాంబశివరావు, కార్యదర్శి బాబి మణికాంత్,కర్ర సందీప్, అనుదీప్, కారుమంచి సునీల్, కాళిదాసు గౌతమ్, చుక్కపల్లి రమణ, చంటి,ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ కార్యదర్శి చిలకా రఘు,కుర్రా అంక మహేష్ ,రామరాజు, ప్రసన్న, భరత్ తదితర ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

దుర్గి అక్టోబర్ 06 ( స్పంద న్యూస్) పల్నాడు జిల్లా ఎస్పీ జగదీష్ ఆడహల్లి ఆదేశాల మేరకు దుర్గి ఎస్ఐ శ్రీ బి. గోపాల్ దుర్గి మండల పరిధిలో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి, ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో అడిగొప్పల గ్రామ శివారులోని ఎర్రవాగు కాలువ బ్రిడ్జి, పోలేపల్లి క్రాస్ రోడ్డు వద్ద ప్రమాదాలను నివారించే ఉద్దేశంతో బారిగేట్లు, హెచ్చరిక సైన్ బోర్డులు తదితర రోడ్డు భద్రతా ఏర్పాట్లు చేశారు. వాహనదారులు ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను గమనించి, వేగాన్ని నియంత్రించుకుని జాగ్రత్తగా వాహనాలు నడపాలని పోలీసులు సూచించారు.



# ప్రభుత్వ పాఠశాలల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యం

- మూలాలు మర్చిపోకుండాగ్రామాభివృద్ధికి తోడ్పడిన దాతరామిరెడ్డిఅభినందనీయుడు
- విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి
- చిరుమామిళ్ల హైస్కూల్‌లో రూ. 46 లక్షల వ్యయంతో నిర్మించిన రన్నింగ్ ట్రాక్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్




చిలకలూరిపేటఅక్టోబర్ 06 స్పంద న్యూస్: నాదెండ్ల మండలం చిరుమామిళ్ల గ్రామంలోని నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ హైస్కూల్ లో రూ. 46 లక్షల సి.ఎస్.ఆర్ నిధులతో నూతనంగా నిర్మించిన ఆధునిక రన్నింగ్ ట్రాక్‌ను, క్రీడా మైదానాన్ని జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణను, రన్నింగ్ ట్రాక్‌ను జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అమెరికాలో స్థిరపడిన చిరుమామిళ్ల గ్రామ వాస్తవ్యులు రామిరెడ్డి తమ సొంత ఊరిపై మమకారంతో రూ. 46 లక్షల సి.ఎస్.ఆర్ ఫండింగ్ ద్వారా ఈ రన్నింగ్ ట్రాక్ నిర్మించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఎంత ఎదిగినా తాము చదువుకున్న ఊరిని, పాఠశాలను మర్చిపోకూడదనడానికి రామిరెడ్డి నిదర్శనమని , ఆయన ఇప్పటికే ఊరిలో కళ్యాణ మండపం, త్రాగునీటి వసతులు కల్పించి ఎంతో సేవ చేశారన్నారు. ఈ విధమైన అత్యాధునిక క్రీడా వసతులు పల్నాడు జిల్లాలోని ఏ ప్రైవేట్ లేదా ప్రభుత్వ పాఠశాలలోనూ లేవని, ఈ ట్రాక్ ద్వారా భవిష్యత్తులో చిరుమామిళ్ల స్కూల్‌లోనే జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించడానికి అద్భుతమైన అవకాశం లభించిందని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థులు కేవలం చదువే కాకుండా ప్రతిరోజూ కనీసం ఒక గంట పాటు రన్నింగ్, యోగా, వాలీబాల్, బాస్కెట్ బాల్ వంటి శారీరక వ్యాయామాలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. బాడీ యాక్టివ్‌గా ఉంటేనే మైండ్ మరింత యాక్టివ్‌గా పనిచేస్తుందని, ముఖ్యంగా విద్యార్థినులు న్యూట్రిషన్, ఐరన్ కలిగిన ఆహారంపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. గత ఏడాది ఈ స్కూల్ నుండి 11 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటి సీట్లు సాధించారని, ఈసారి వంద శాతం ఫలితాలతో పాటు మరింత మంది ట్రిపుల్ ఐటి సీట్లు సాధించడాన్ని విద్యార్థులు ఒక ఛాలెంజ్‌గా తీసుకోవాలని కోరారు. విద్యార్థుల కోసం అదనపు మధ్యాహ్న భోజనం, వాలంటీర్ ఉపాధ్యాయులను కూడా ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ప్రపంచంతో పోటీ పడాలంటే విద్యార్థులకు ఇంగ్లీష్ మాట్లాడటం, కంప్యూటర్ నైపుణ్యాలు చాలా అవసరమని, స్కూల్లో ఉన్న డిజిటల్ స్క్రీన్స్ ద్వారా యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్ నేర్చుకోవాలని, చాట్ జీపీటీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి నూతన సాంకేతికతను చదువుకు ఉపయోగించుకోవాలని సూచించారు. పాఠశాలలో ఖాళీగా ఉన్న నాలుగు గదులలో విద్యార్థులకు కంప్యూటర్, ఏఐ లేదా ఒకేషనల్ కోర్సులు నేర్పించడానికి ప్రభుత్వం తరపున ఒక స్కిల్ ల్యాబ్ మరియు డిజిటల్ లైబ్రరీని మంజూరు చేస్తున్నట్లు ఈ సందర్భంగా కలెక్టర్ ప్రకటించారు. అనంతరం చిరుమామిళ్ల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి ఆసుపత్రి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు కొంత మంది జిల్లా కలెక్టర్ ను కలసి వినతి పత్రం అందించారు. ప్రభుత్వ భూమిలో నివాసం ఏర్పరచుకున్న మాకు భూములు ఖాళీ చేయాలని ప్రభుత్వం నుండి నోటీసులు వచ్చాయని , ఇప్పటికప్పుడు ఎక్కడి వెళ్ళాలని జిల్లా కలెక్టర్ వద్ద ఆవేదన వ్యక్తం చేసారు. ఈ విషయమై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేప్పట్టి తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని గ్రామస్తులకు జిల్లా కలెక్టర్ తెలిపారు . ఈ కార్యక్రమంలో ఎన్.ఆర్.ఐ దాత నడికట్టు రామిరెడ్డి, జిల్లా సర్వ శిక్ష అభియాన్ అధికారి శ్యాం,పాఠశాల ప్రధానోపాధ్యాయులు మేకల కిశోర్ , ఉపాధ్యాయులు , గ్రామ పెద్దలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# చిలకలూరిపేటలో విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం



### -ఆటోల్లో పరిమితికి మించి విద్యార్థుల రవాణా.. అధికారుల పర్యవేక్షణ శూన్యం

చిలకలూరిపేట అక్టోబర్ 6 స్పంద న్యూస్: రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితుల్లోనూ తమ పిల్లలు ఉన్నతంగా చదువుకోవాలనే తాపత్రయంతో తల్లిదండ్రులు ప్రయాసపడుతున్నారు. ఇందుకోసం నెలకు సుమారు రూ. 300 నుంచి రూ. 500 వరకు చెల్లించి స్థానిక ఆటోల్లో విద్యార్థులను పాఠశాలలకు పంపుతున్నారు. అయితే, కొందరు ఆటో డ్రైవర్లు కాసుల కక్కుర్తితో విద్యార్థుల ప్రాణాలను గాల్లో దీపంలా మారుస్తున్నారు.

### బస్తాల్లా కుక్కుతున్నారు ప్రాణాలకు రక్షణ కరువు

ఆటోల్లో సామర్థ్యానికి మించి పిల్లలను బస్తాలను కుక్కినట్లు ఎక్కిస్తున్నారు. స్థలం చాలక కొందరు చిన్నారులు ఆటో వెనుక భాగంలో ప్రమాదకర రీతిలో వేలాడుతూ ప్రయాణిస్తున్నారు. రద్దీగా ఉండే రోడ్లలో ఎక్కడైనా సడెన్ బ్రేక్ వేసినా, స్పీడ్ బ్రేకర్ వద్ద అదుపు తప్పినా, ఏదైనా వాహనం ఎదురొచ్చినా తీవ్ర ప్రమాదం జరిగే ఆస్కారముంది. కొద్దిపాటి అజాగ్రత్త జరిగినా పసి ప్రాణాలు గాల్లో కలిసిపోయే ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

### పట్టించుకోని సంబంధిత అధికారులు

స్కూలు వేళల్లో ఇంతటి దారుణ పరిస్థితులు నెలకొంటున్నా పోలీసు, రవాణా శాఖ అధికారులు కనీస తనిఖీలు చేపట్టకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆటోలపై పూర్తిస్థాయిలో నిఘా, నియంత్రణ లేకపోవడంతో ఆటో డ్రైవర్లు నిబంధనలను బేఖాతరు చేస్తున్నారు. సురక్షి తంగా బడికి తీసుకెళ్లి, తిరిగి ఇంటికి చేర్చాల్సిన బాధ్యతను గాలికొదిలేస్తే తమ పిల్లల పరిస్థితి ఏమిటని తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళ్తున్న స్కూలు ఆటోలపై కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

# దాహార్తి తీర్చే బృహత్ ప్రాజెక్ట్

## రూ.91.13 కోట్లతో 'అమరజీవి జలధార' పనులకు శంకుస్థాపన

### కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుచూపుతో అడుగులు వేస్తోంది:ఎమ్మెల్యే

### చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఇది గొప్ప వరం.. ప్రతి ఇంటికీ శుద్ధ జలమే మా లక్ష్యం



నర్సరావుపేట, అక్టోబర్ 06 (స్పంద న్యూస్):నర్సరావుపేట నియోజకవర్గ ప్రజల చిరకాల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ ఆధ్వర్యంలో భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. 'జల్ జీవన్ మిషన్ 2.0 -- అమరజీవి జలధార' పథకం కింద రూ. 91.13 కోట్ల అంచనా వ్యయంతో మంజూరైన తాగునీటి సదుపాయ పనులకు మంగళవారం కోటప్పకొండ శివకుటుంబం వద్ద అత్యంత ఘనంగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య ప్రారంభకులుగా హాజరై శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. శంకుస్థాపన అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే ప్రజల బాగోగులు, సంక్షేమం, సమగ్ర అభివృద్ధి పట్ల ఎంతో ముందుచూపుతో కార్యాచరణ రూపొందించి అడుగులు వేస్తోంది.గతంలో ఎన్నడూ లేనివిధంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల సమస్యలను గుర్తించి యుద్ధప్రాతిపదికన పరిష్కారాలు చూపుతున్నాం. ఇందులో భాగంగానే నర్సరావుపేట నియోజకవర్గంలోని మారుమూల గ్రామాలు, శివారు ప్రాంతాల ప్రజలు ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న తాగునీటి కష్టాలకు శాశ్వత ముగింపు పలకడమే మా సంకల్పం. ఇప్పుడు రూ. 91.13 కోట్ల భారీ నిధులతో ప్రారంభమైన ఈ 'జల్ జీవన్ మిషన్ 2.0 -- అమరజీవి జలధార' ప్రాజెక్ట్ నియోజకవర్గ పరిధిలోని చుట్టుపక్కల గ్రామాల ప్రజలందరికీ దక్కిన ఒక పెద్ద తాగునీటి వరప్రసాదం. నియోజకవర్గంలోని ప్రతి గడపకూ, ప్రతి ఇంటికీ శుద్ధమైన, సురక్షితమైన, నాణ్యమైన రక్షిత మంచినీటిని నిరంతరాయంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యం. ఈ బృహత్ ప్రాజెక్టు నిర్మాణంలో ఎక్కడా రాజీపడకుండా అత్యున్నత నాణ్యతా ప్రమాణాలు పాటించాలి. నిర్దేశిత గడువులోగా పనులన్నీ పూర్తి చేసి త్వరితగతిన ప్రజల దాహార్తిని తీర్చేలా అందుబాటులోకి తీసుకురావాలి అని కాంట్రాక్టర్లను, సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్డబ్ల్యూఎస్) అధికారులు ప్రాజెక్టు సమగ్ర వివరాలను వెల్లడిస్తూ, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సుదీర్ఘ పైప్‌లైన్ నెట్‌వర్క్ విస్తరణ, అవసరమైన ప్రాంతాల్లో నూతన ఓవర్‌హెడ్ సర్వీస్ రిజర్వాయర్లు (ట్యాంకులు) నిర్మిస్తున్నామని, ఈ పథకం పూర్తయితే నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి అనేది ఇక ఉండదని వివరించారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులు, ఇంజనీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రెగ్యులరైజ్ చేసేంత వరకు పోరుబాటే

### కాంట్రాక్ట్ వైద్యారోగ్య ఉద్యోగుల నిరవధిక సమ్మె

### నేటి నుంచి సేవలూ బంద్:ఏపీ జేఏసీ టీమ్ హెచ్చరిక




నరసరావుపేట, అక్టోబర్ 06 (స్పంద న్యూస్): తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కాంట్రాక్ట్ మెడికల్ ఎ హెల్త్ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె పల్నాడు జిల్లా కేంద్రంలో ఉధృతంగా కొనసాగుతోంది. స్థానిక గాంధీ పార్క్ వేదికగా ఉద్యోగులు చేపట్టిన ఆందోళన శిబిరానికి పలు ప్రజా, ఉద్యోగ సంఘాలు భారీగా తరలివచ్చి సంపూర్ణ సంఘీభావం తెలిపాయి. ఈ నిరసన ప్రదర్శనలో 200 మందికి పైగా వైద్యారోగ్య ఉద్యోగులు, ప్రతినిధులు పాల్గొని ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమ్మె శిబిరాన్ని ఉద్దేశించి సీఐటీయూ, అఫంసా తదితర సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న కాంట్రాక్ట్ వైద్య సిబ్బంది పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించడం తగదన్నారు. ఏళ్ల తరబడి అరకొర జీతాలతో సేవలు అందిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని, 100 శాతం గ్రాస్ జీతం తక్షణమే చెల్లించాలని స్పష్టం చేశారు.

న్యాయబద్ధమైన ఈ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం తాత్సారం చేస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనను తీవ్రతరం చేస్తామని ఏపీ జేఏసీ టీమ్ పల్నాడు నాయకులు స్పష్టం చేశారు. రేపటి నుంచి సాధారణ విధులతో పాటు అత్యవసర సేవలను సైతం బహిష్కరిస్తూ కాంట్రాక్ట్ సిబ్బంది అందరూ నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం దిగివచ్చి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేంత వరకు కార్మిక లోకం ఐక్యంగా పోరాడుతుందని వారు తేల్చిచెప్పారు.

# త్రికోటేశ్వరుని భక్తులకు ఆహ్లాదకర కానుక

### 2 కోట్లతో కోటప్పకొండ గిరి ప్రదక్షిణ రోడ్డున నగరవనం ప్రారంభం

### వర్చువల్ విధానంలో ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్

### ముఖ్య అతిథిగా పాల్గొని అధికారులకు దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్యే చదలవాడ



నరసరావుపేట, అక్టోబర్ 06 (స్పంద న్యూస్): ప్రసిద్ధ శైవక్షేత్రమైన కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి క్షేత్రానికి విచ్చేసే భక్తులు, ప్రకృతి ప్రేమికులకు సరికొత్త ఆహ్లాదాన్ని పంచేందుకు అటవీ శాఖ ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణ రోడ్డు పక్కన ?2 కోట్ల వ్యయంతో తీర్చిదిద్దిన నూతన 'నగరవనం' ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ మరియు పర్యావరణ శాఖల మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ వర్చువల్ విధానంలో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని పుణ్యక్షేత్రాల పరిసరాల్లో పచ్చదనాన్ని పెంపొందించడం, జీవవైవిధ్యాన్ని కాపాడటం ప్రభుత్వ ప్రాధాన్యతా అంశాలని స్పష్టం చేశారు. ఆలయాలు కేవలం పూజా కార్యక్రమాలకే కాకుండా భక్తులకు మానసిక ప్రశాంతతను అందించే పవిత్ర నిలయాలుగా తీర్చిదిద్దుతున్నామని, పవిత్ర గిరి ప్రదక్షిణ చేసే వేలాది మంది భక్తులకు ఈ నగరవనం చక్కటి సేదతీర్పునిస్తుందని ఆకాంక్షించారు. స్థానికంగా కోటప్పకొండ వద్ద నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి నరసరావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా హాజరై నగరవనంలోని వివిధ విభాగాలను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కోటప్పకొండ అభివృద్ధికి, పర్యావరణ ప్రాజెక్టులకు నిధులు కేటాయించి నందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌లకు నియోజకవర్గ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కోటప్పకొండను సమగ్ర పర్యావరణ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. నగరవనంలో భక్తుల రక్షణ, పారిశుధ్యం, తాగునీరు, పిల్లల ఆటస్థలాలు, విశ్రాంతి షెల్టర్ల నిర్వహణలో రాజీ పడకూడదని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖాధికారి, అటవీ శాఖ ఉన్నతాధికారులు, వివిధ విభాగాల అధికారులు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, స్థానిక ప్రజానీకం మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి 5ఖ రన్‌లో కృష్ణవేణి విద్యార్థుల హవా.. రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత



నరసరావుపేట, అక్టోబర్ 06 (స్పంద న్యూస్): పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మాచర్ల పట్టణంలోని పోలీస్ ప్లే గ్రౌండ్‌లో మంగళవారం 06-10-2026 నిర్వహించిన జిల్లా స్థాయి 5కే రన్ పోటీల్లో కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీల్లో పురుషుల విభాగంలో బి.హేమసుందర్ రెడ్డి, ఆర్. సాయి ప్రథమ స్థానాలు సాధించగా, మహిళల విభాగంలో ఎం.చందేశ్వరి ప్రథమ స్థానం,ఎస్.శ్రీలత ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు నాతాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లా స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రథమ బహుమతిగా ?10,000/-, ద్వితీయ బహుమతిగా ?7,000/- నగదు పురస్కారాలు అందజేసినట్లు తెలిపారు. ముఖ్యంగా పురుషుల విభాగంలో తమ కళాశాల నుంచి బరిలోకి దిగిన ఐదుగురు విద్యార్థులూ టాప్-5 స్థానాలను కైవసం చేసుకోవడం కళాశాలకే గర్వకారణమని, ఇది వారి కఠోర సాధనకు నిదర్శనమని కొనియాడారు. పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన విద్యార్థులను కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు ఈదర ఆదిబాబు,ఎస్.డి.మహమ్మద్, అధ్యాపక,అధ్యాపకేతర బృందం ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా స్థాయిలో సత్తా చాటిన ఈ విద్యార్థులు ఈ నెల 8వ తేదీన విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి 5కే రన్ పోటీల్లోనూ రాణించి కళాశాలకు, పల్నాడు జిల్లాకు మరింత పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కళాశాల యాజమాన్యం ఆకాంక్షించింది.

## వాహనాల వేగ నియంత్రణకు జిగ్‌జాగ్ విధానంలో డ్రమ్ముల ఏర్పాటు



యడ్లపాడుఅక్టోబర్ 6 స్పంద న్యూస్ యడ్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని తిమ్మాపురం గ్రామ జంక్షన్ వద్ద వాహనాల వేగాన్ని నియంత్రించి, రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు జిగ్‌జాగ్ విధానంలో డ్రమ్ములను ఏర్పాటు చేయడం జరిగింది. జిల్లా ఎస్పీ జగదీష్ ఆద హల్లి ఆదేశాల మేరకు, చిలకలూరిపేట రూరల్ సీఐ బి. సుబ్బా నాయుడు, ఎస్ఐ శివరామకృష్ణ సమన్వయంతో తిమ్మాపురం జంక్షన్ వద్ద రహదారిపై డ్రమ్ములను జిగ్‌జాగ్ ఆకారంలో ఏర్పాటు చేశారు. ఈ ఏర్పాటుతో జంక్షన్ వద్దకు వచ్చే వాహనాలు సహజంగానే వేగాన్ని తగ్గించుకుని ప్రయాణించేలా చర్యలు తీసుకోవడం జరిగింది. ముఖ్యంగా జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న ఈ ప్రాంతంలో వాహనాల అధిక వేగాన్ని నియంత్రించడం, జంక్షన్ వద్ద రహదారి దాటే వాహనదారులు మరియు పాదచారుల భద్రతను పెంచడం, ప్రమాదాల అవకాశాలను తగ్గించడం ఈ చర్య యొక్క ప్రధాన ఉద్దేశ్యం. వాహనదారులు జంక్షన్ వద్ద వేగాన్ని తగ్గించి, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, అప్రమత్తంగా ప్రయాణించాలని పోలీసులు సూచించారు. రహదారి భద్రతకు సంబంధించి అవసరమైన మరిన్ని చర్యలు కూడా పరిస్థితిని బట్టి చేపడతామని తెలిపారు.

## త్రాగునీటి సరఫరాపై నిర్లక్ష్యం వద్దు

### ఈఎల్ఎస్ఆర్‌లకు నెలవారీ శుభ్రత.. లీకేజీలకు తక్షణ మరమ్మతులు

గుంటూరు, అక్టోబరు 6 (స్పంద న్యూస్ ): నగర ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో తాగునీటి సరఫరా, పైప్‌లైన్ లీకేజీలు, డ్రైనేజీ, రోడ్లు, అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈఎల్ఎస్ఆర్‌లను ప్రతి నెల శుభ్రం చేసి నివేదిక ఇవ్వాలని, పైప్‌లైన్ లీకేజీలను వెంటనే మరమ్మతు చేయాలని సూచించారు. పీజీఆర్ఎస్, 103 కాల్ సెంటర్ ద్వారా వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని, యూజీడీ మ్యాన్‌హోల్స్ శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. వాటర్ మీటర్లలో లోపాలను సరిచేసి అవసరమైన చోట కొత్త మీటర్లు ఏర్పాటు చేయాలన్నారు. డ్రైన్ల పూడికతీత పనులను ఏఈలు ప్రతి వారం పర్యవేక్షించాలని, పనులు ప్రారంభించని టెండర్లను రద్దు చేసి రీటెండర్ పిలవాలని సూచించారు. నగరంలో పాట్‌హోల్స్ లేకుండా వెంటనే మరమ్మతులు చేపట్టడంతో పాటు పార్కులు, ఇతర అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కమిషనర్ ఆదేశించారు.



## పౌష్టికాహారంతో ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం

### కొర్రపాడులో "పోషణ మాహ్ అంగన్వాడీ ఉత్సవం"



గుంటూరు అక్టోబర్ 6 స్పంద న్యూస్ : "సేవా సంకల్ప అభియాన్ 25 సంవత్సరాల సేవా ప్రస్థానం"లో భాగంగా కొర్రపాడు గ్రామంలో నిర్వహించిన "పోషణ మాహ్ అంగన్వాడీ ఉత్సవం" కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.వి. సుబ్బారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం, ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న అంగన్వాడీ, పోషకాహారం, ఆరోగ్య, ప్రాథమిక విద్యా సేవలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్నారుల తొలి దశలోనే సరైన పోషణ, ఆరోగ్యం, విద్య అందించడం వారి భవిష్యత్తుకు బలమైన పునాది అని తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులకు2 పుస్తకాలు పంపిణీ చేసి, అంగన్వాడీ సిబ్బందిని శాలువాలతో సత్కరించారు. "పిల్లల ఆరోగ్యం, పోషణ, విద్యపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. అంగన్వాడీ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి" అని వై.వి. సుబ్బారావు కోరారు.

## బ్రాడీపేటలో ఘనంగా రంగోలి కార్యక్రమం



మోదీ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై విద్యార్థినుల సృజనాత్మక ప్రదర్శన

గుంటూరు, అక్టోబరు 6 (స్పంద న్యూస్ ): ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్లో భాగంగా బ్రాడీపేటలోని బండ్లమూడి హనుమాయమ్మ హిందూ మహిళా డిగ్రీ కళాశాలలో రంగోలి కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ మూడో మండల అధ్యక్షురాలు గాయత్రి బెహరా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా బీజేపీ అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మోదీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విద్యార్థినులు రంగోలి రూపంలో సృజనాత్మకంగా ప్రదర్శించారు.

## పేట టపాసు దుకాణాలపై చర్యలు తీసుకోండి



చిలకలూరిపేట అక్టోబర్ 6 స్పంద న్యూస్ : పట్టణంలో జాతీయ రహదారి పక్కన బాణసంచా దుకాణాల వల్ల ప్రాణ నష్టం జరుగుతోందని, తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ నవతరం పార్టీ జాతీయ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యం జిల్లా జాయింట్ కలెక్టర్ సంజనా శ్రీహర్షకు వినతిపత్రం అందజేశారు. ఇటీవల జాతీయ రహదారి పక్కన ఓ బాణసంచా దుకాణం పేలి ఒకరు మృతి చెందడం, మరికొందరు గాయపడటం వ్యాపారుల నిర్లక్ష్యం వల్లే జరిగిందని ఆయన వినతిపత్రంలో పేర్కొన్నారు. అనుమతులకు మించి సరుకు నిల్వ చేయడం, సరైన ఫైర్ సేఫ్టీ పాటించకపోవడం, రహదారిని ఆనుకుని దుకాణాలు ఏర్పాటు చేయడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. దీపావళి నేపథ్యంలో హోల్‌సేల్, రిటైల్ వ్యాపారం జోరుగా సాగుతుండగా, వందలాది మంది కొనుగోలుకు వస్తారని, అలాంటి సమయంలో ప్రమాదం జరిగితే భారీ ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా కొందరు అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు చేస్తున్నారని ఆరోపించారు. జాతీయ రహదారి వెంట ఉన్న దుకాణాలను తొలగించి, రిటైల్ దుకాణాలను ఊరికి దూరంగా పొలాల్లో ఏర్పాటు చేయాలని కోరారు. తీసుకున్న చర్యలను లిఖితపూర్వకంగా తమ పార్టీ కార్యాలయానికి తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన జేసీ సంజనా శ్రీహర్ష.. తప్పనిసరిగా అన్ని శాఖల అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని, తీసుకున్న చర్యల వివరాలను తెలియజేస్తామని హామీ ఇచ్చారని రావు సుబ్రహ్మణ్యం తెలిపారు.

## అమిన్ సాహెబ్ పాలెంలో గ్యాస్ లీక్ దగ్ధమైన ఇల్లు

చిలకలూరిపేట అక్టోబర్ 6 స్పంద న్యూస్: నియోజకవర్గ పరిధిలోని నాదెండ్ల మండలం అమిన్ సాహెబ్ పాలెం గ్రామంలో మంగళవారం ఉదయం అకస్మాత్తుగా గ్యాస్ లీకై భయానక వాతావరణం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో పోత్తూరు రాంబాబుకు చెందిన పెంకుటిల్లు పూర్తిగా దెబ్బతినగా, ఇంట్లోని విలువైన వస్తువులు కాలిబూడిదయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పోతురు రాంబాబు ఇంట్లో ఒక్కసారిగా గ్యాస్ లీక్ కావడంతో తీవ్ర శబ్దం, మంటలు చెలరేగాయి.



ప్రజాగళమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక





# కెప్టెన్సీకి గుడ్‌బై చెప్పిన హర్మన్‌ప్రీత్ కౌర్

**ముంబై, అక్టోబర్ 5 (స్పంద న్యూస్):** భారత మహిళల క్రికెట్ జట్టు సీనియర్ ప్లేయర్ హర్మన్‌ప్రీత్ కౌర్.. కెప్టెన్సీకి గుడ్‌బై చెప్పారు. నాయకత్వ బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్లు ఆమె ప్రకటించారు. అన్ని ఫార్మాట్ల పగ్గాలను వదిలేసినట్లు ఆమె తెలిపారు. 2025లో ఇండియాకు వన్డే వరల్డ్‌కప్ అందిచిన హర్మన్‌ప్రీత్.. కెప్టెన్‌గా చేశారు. భారత జట్టుకు అతి సుదీర్ఘ కాలం కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ప్లేయర్‌గా హర్మన్‌ప్రీత్ నిలిచింది. కౌర్ తప్పుకోవడంతో ఇక వైస్ కెప్టెన్ స్మృతి మందానా లీడర్‌షిప్ బాధ్యతలు చేపట్టే అవకాశాలు ఉన్నాయి. కెప్టెన్సీ నుంచి తప్పుకోనున్న హర్మన్‌ప్రీత్ ఇక నుంచి ఎక్కువగా బ్యాటింగ్‌పై ఫోకస్ పెట్టనున్నట్లు తెలుస్తోంది. తాను తీసుకున్న నిర్ణయం సులువైంది కాదు అని, ఇది ఎన్నో ఏళ్ల జ్ఞాపకాలు, భావోద్వేగాలు, త్యాగాల ఫలితం అని ఆమె అన్నారు. ప్రస్తుతం హర్మన్‌ప్రీత్ వయసు 37 ఏళ్లు. ఆమె అయిదు టెస్టులు, 51 వన్డేలు, 155 టీ20లకు కెప్టెన్‌గా న్నారు. ఇన్‌స్టాగ్రామ్ పోస్టులో ఆమె తన కెప్టెన్సీ వీడ్కోల ప్రకటన చేసింది. తాజాగా ముగిసిన ఆసియా గేమ్స్‌లో.. హర్మన్ నేతృత్వంలోని భారత జట్టు గోల్డ్ మెడల్ కొట్టిన విషయం తెలిసిందే. రెండు రోజుల క్రితమే గౌహతిలో బీసీసీ కార్యదర్శి దేవజిత్ సైకియాతో హర్మన్, స్మృతి, అమోల్ మజుందార్ కలిసిన విషయం తెలిసిందే. నాయకత్వ బాధ్యతలను త్యజించినా.. తన క్రికెట్ జర్నీ కొనసాగుతుందని, బ్యాటింగ్‌పై ఫోకస్ పెట్టనున్నట్లు ఆమె చెప్పారు.

# పాకిస్థాన్ క్రికెట్‌కు బిగ్ షాక్

## సగం ధరకే ప్రసార హక్కుల విక్రయం!

**ఇస్లామాబాద్, అక్టోబర్ 6 (స్పంద న్యూస్):** ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న పాకిస్థాన్ క్రికెట్ బోర్డుకు (పీసీబీ) ప్రసార హక్కుల విషయంలో కోలుకోలేని దెబ్బ తగిలింది. తమ సొంత గడ్డపై జరగనున్న 25 అంతర్జాతీయ మ్యాచ్‌ల మీడియా ప్రసార హక్కులను పీసీబీ నిర్దేశించిన రిజర్వ్ ధరలో సగానికంటే తక్కువ ధరకు విక్రయించాల్సి వచ్చింది. ప్రసార హక్కుల వేలంలో కేవలం ప్రభుత్వ ఆధ్వర్యంలోని 'పాకిస్థాన్ టెలివిజన్ కార్పొరేషన్' (పీటీవీ) మాత్రమే ఏకైక బిడ్డర్‌గా నిలవడమే ఇందుకు ప్రధాన కారణం. దీంతో పీసీబీ ఆశించిన రూ. 600 మిలియన్ల రిజర్వ్ ధరకు బదులుగా కేవలం రూ. 350 మిలియన్లకే హక్కులను పీటీవీ దక్కించుకుంది. తాజా ఒప్పందంలో పాకిస్థాన్ స్వదేశంలో ఆడే 5 టెస్టులు, 14 వన్డేలు, 6 టీ20లు కలిపి మొత్తం 25 మ్యాచ్‌లు ఉన్నాయి. ఇందులో ఈ నెలలో శ్రీలంకతో జరగనున్న టీ20, త్రైపాక్షిక వన్డే సిరీస్, రెండవ విడత టెస్టు సిరీస్‌లతో పాటు 2027 జనవరి వరకు జరగబోయే అంతర్జాతీయ మ్యాచ్‌లు చేరి ఉన్నాయి. ఈసారి గతంలో మాదిరిగా బ్రాడ్‌కాస్టర్లు కన్సార్టియంగా ఏర్పడి బిడ్డింగ్‌లో పాల్గొనడాన్ని పీసీబీ అనుమతించకపోవడం, మరోవైపు గతంలో హక్కులు దక్కించుకున్న సంస్థలు బిలియన్ల కొద్దీ బకాయిలు చెల్లించకపోవడంతో ప్రధాన ప్రసార సంస్థలన్నీ టెండర్‌కు దూరంగా ఉండిపోయాయి. పాకిస్థాన్ జాతీయ క్రికెట్ జట్టు ఇటీవలి కాలంలో అత్యంత పేలవ ప్రదర్శన కనబరుస్తుండటంతో స్పాన్సర్లు, ప్రకటనదారులు ఆ దేశ క్రికెట్‌పై ఆసక్తి చూపకపోవడం కూడా ఈ పరిస్థితికి మూలకారణంగా మారింది. కేవలం అంతర్జాతీయ సిరీస్‌లే కాకుండా పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్11) ప్రసార హక్కులకు కూడా ఆశించిన మేర స్పందన రాలేదని సమాచారం. మ్యాచ్‌ల హక్కులు సగం ధరకు పడిపోవడంతో పీసీబీ రాబడిపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడనుంది.

# 2036 ఒలింపిక్స్ కోసం ఏడుగురి పోటీ!



- ఆతిథ్య రేసులో భారత్‌తోపాటు మరో ఆరు దేశాలు
- అక్టోబర్ 31తో కొత్త ఆసక్తి ప్రతిపాదనలకు గడువు
- నవంబర్‌లో ఫ్యూచర్ హోస్ట్ కమిషన్ ముందు ప్రాజెక్టుల ప్రజెంటేషన్
- 2027 మార్చిలో తొలి వడపోత.. తదుపరి దశకు ఎంపిక
- 2029 మధ్యలో 2036 విశ్వక్రీడల వేదికపై తుది నిర్ణయం



**లాసాన్, అక్టోబర్ 6 (స్పంద న్యూస్):** 2036 ఒలింపిక్స్, పారాలింపిక్స్ నిర్వహణ హక్కుల కోసం భారత్‌కు గట్టి పోటీ ఎదురుకానుంది. భారత్‌తోపాటు జర్మనీ, హంగేరి, ఖతార్, రిపబ్లిక్ ఆఫ్ కొరియా, దక్షిణాఫ్రికా, తుర్కియే ప్రస్తుతం ఆతిథ్య రేసులో ఉన్నాయని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ మంగళవారం వెల్లడించింది. ఈ ఏడు దేశాలు ప్రస్తుతం ఐఓసీతో ప్రాథమిక చర్చల దశలో ఉన్నాయి. 2036 విశ్వక్రీడల ఆతిథ్య ఎంపిక ప్రక్రియకు సంబంధించి ఐఓసీ కొత్త రోడ్‌మ్యాప్‌ను ప్రకటించింది. ప్రస్తుతం ప్రకటించిన ఏడు దేశాలతోపాటు కొత్తగా ఆసక్తి చూపే దేశాలకు అక్టోబర్ 31 వరకు అవకాశం ఉంది. ఆ తర్వాత 2036 క్రీడల కోసం కొత్త ఆసక్తి ప్రతిపాదనలను స్వీకరించబోమని ఐఓసీ స్పష్టం చేసింది.

### నవంబర్‌లో తొలి పరీక్ష

ఆతిథ్య రేసులో ఉన్న దేశాలు నవంబర్‌లో ఐఓసీ ఫ్యూచర్ హోస్ట్ కమిషన్ ముందు తమ ఒలింపిక్స్ ప్రాజెక్టులను వర్చువల్‌గా ప్రజెంట్ చేయనున్నాయి. క్రీడా వేదికల మాస్టర్ ప్లాన్, క్రీడాకారులకు కల్పించే సౌకర్యాలు, నిధుల సమీకరణ, ప్రభుత్వ-ప్రజా మద్దతు, నిర్వహణ సామర్థ్యం, క్రీడల అనంతరం మౌలిక సదుపాయాల వినియోగం వంటి అంశాలను ఐఓసీ పరిశీలించనుంది. ఈ ప్రజెంటేషన్ల తర్వాత సాధ్యాసాధ్యాలపై సమగ్ర అంచనా చేపడతారు. 2027 మార్చిలో ఐఓసీ ఎగ్జిక్యూటివ్ బోర్డు ఆసక్తి చూపుతున్న దేశాల్లో కొన్నింటిని తదుపరి 'స్ట్రాటజిక్ డైలాగ్' దశకు ఎంపిక చేయనుంది. అక్కడి నుంచి ఆయా ప్రతిపాదనలపై మరింత లోతైన పరిశీలన కొనసాగుతుంది.

### భారత్‌కు ఇదే తొలి అవకాశం

భారత్ ఇప్పటివరకు ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వలేదు. భారత ఒలింపిక్ సంఘం 2024 అక్టోబర్ 1న 2036 ఒలింపిక్స్, పారాలింపిక్స్ నిర్వహణపై ఐఓసీకి ఆసక్తి లేఖ సమర్పించింది. ప్రస్తుతం భారత ప్రతిపాదన ఫ్యూచర్ హోస్ట్ కమిషన్‌తో చర్చల దశలో ఉంది. అహ్మదాబాద్‌ను



ప్రధాన కేంద్రంగా చేసుకుని భారత్ తన ఆతిథ్య ప్రణాళికను ముందుకు తీసుకెళ్తోంది.

### 2029లో తేలనున్న వేదిక

ఐఓసీ కొత్త ప్రక్రియ ప్రకారం 2028 చివర్లో అనుకూలమైన ప్రతిపాదనలతో లక్ష్యిత చర్చలు ప్రారంభమవుతాయి. చివరకు 2029 మధ్యలో జరిగే ఐఓసీ సమావేశంలో 2036 ఒలింపిక్స్ ఆతిథ్యంపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. 2028 ఒలింపిక్స్‌కు లాస్ ఏంజెల్స్, 2032 క్రీడలకు బ్రిస్బేన్ ఇప్పటికే ఆతిథ్య నగరాలుగా ఖరారయ్యాయి.







# అయ్యర్ శివమెత్తాడు.. భారత్ బోణీ కొట్టింది!

- తొలి టీ20 శతకంతో చెలరేగిన టీమిండియా కెప్టెన్
- 43 బంతుల్లో అజేయంగా 102.. పది ఫోర్లు, ఆరు సిక్సర్లు
- 42 బంతుల్లోనే సెంచరీ.. విండీస్ బౌలర్లపై విధ్వంసం
- ఇషాన్‌తో అజేయంగా 137 పరుగుల భాగస్వామ్యం
- 32 బంతులు మిగిలుండగానే ఎనిమిది వికెట్ల తేడాతో భారత్ ఘన విజయం



**లక్నో, అక్టోబర్ 6 (స్పంద న్యూస్):** కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ బ్యాట్ ఝుళిపిస్తే.. వెస్టిండీస్ బౌలర్లు బెంబేలెత్తిపోయారు. తొలి అంతర్జాతీయ టీ20 శతకంతో అయ్యర్ విధ్వంసం సృష్టించగా.. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ అదిరిపోయే బోణీ కొట్టింది. లక్నోలోని ఎకానా స్టేడియంలో మంగళవారం జరిగిన తొలి టీ20లో వెస్టిండీస్‌ను భారత్ ఎనిమిది వికెట్ల తేడాతో చిత్తు చేసింది. 172 పరుగుల లక్ష్యాన్ని కేవలం 14.4 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి ఛేదించింది. దీంతో సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అయ్యర్ 43 బంతుల్లో పది ఫోర్లు, ఆరు సిక్సర్లతో అజేయంగా 102 పరుగులు చేశాడు. కేవలం 42 బంతుల్లోనే శతకాన్ని అందుకున్నాడు. వెస్టిండీస్‌పై అంతర్జాతీయ టీ20ల్లో భారత బ్యాటర్ సాధించిన అత్యంత



వేగవంతమైన శతకంగా ఇది నమోదైంది.

### 35కే రెండు.. ఆ తర్వాత అయ్యర్ ఊచకోత

లక్ష్య ఛేదనలో భారత్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. అభిషేక్ శర్మ 21 పరుగులకు రోస్టన్ ఛేజ్ బౌలింగ్‌లో ఔటవగా.. సంజూ శాంసన్ 11 పరుగులకే అకీల్ హొసేన్‌కు రిటర్న్ క్యాచ్ ఇచ్చాడు. దీంతో 3.3 ఓవర్లలోనే భారత్ 35 పరుగులకు రెండు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో అయ్యర్‌కు ఇషాన్ కిషన్ అండగా నిలిచాడు. తొలుత కాస్త ఆచితూచి ఆడిన అయ్యర్.. క్రీజులో కుదురుకున్నాక గేర్ మార్చేశాడు. 28 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసిన అతడు.. ఆ తర్వాత విండీస్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. చివరకు సిక్సర్‌తో 42 బంతుల్లో తన తొలి టీ20 అంతర్జాతీయ శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. మరోవైపు ఇషాన్ కిషన్ 37 పరుగులతో అజేయంగా నిలిచి కెప్టెన్‌కు చక్కటి సహకారం అందించాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు అజేయంగా 137 పరుగులు జోడించి భారత్‌ను విజయతీరాలకు చేర్చారు.

### నమన్ ధీర్ అరంగేట్రంలోనే అదుర్స్

అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 19.1 ఓవర్లలో 171 పరుగులకు ఆలౌటైంది. షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ 56, షాయ్ హోప్ 52 పరుగులతో రాణించారు. భారత్ తరఫున అరంగేట్ర ఆటగాడు నమన్ ధీర్ మూడు వికెట్లతో ఆకట్టుకోగా.. అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు.

ప్రజాగళమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక
బుధవారం, 7 అక్టోబర్ 2026



# ఎవరికోసమో నేను మారలేను..

## ట్రోలర్స్‌కు రష్మిక స్ట్రాంగ్ కౌంటర్!

**హైదరాబాద్, అక్టోబర్ 6 (స్పంద న్యూస్):** తనపై సోషల్ మీడియాలో వచ్చే వరుస ట్రోలింగ్స్, విమర్శలపై ప్రముఖ కథానాయిక రష్మిక మందన్న తీవ్రస్థాయిలో స్పందించారు. విజయ్ దేవరకొండ, రష్మిక జంటగా నటిస్తున్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'రణబాలి' చిత్రం అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో, చిత్రబృందం ప్రమోషన్లలో వేగం పెంచింది. ఈ క్రమంలో ఇచ్చిన ఓ ప్రత్యేక ఇంటర్వ్యూలో తన వ్యక్తిత్వం, సోషల్ మీడియా వ్యాఖ్యలపై రష్మిక స్పష్టమైన వివరణ ఇచ్చారు. తాను అందరితో సరదాగా, స్నేహపూర్వకంగా ఉండటాన్ని కొందరు మరోలా అర్థం చేసుకుంటున్నారని రష్మిక ఆవేదన వ్యక్తం చేశారు. "అందరితో మంచిగా ఉండటం నా బలహీనత కాదు. నేను ఉన్న చోట ఎల్లప్పుడూ సానుకూల (పాజిటివ్) వాతావరణం ఉండాలని, సరదాగా ఉండాలని అనుకుంటాను. దీనికి ఎవరు ఏ పేరు పెట్టినా నాకు పట్టింపు లేదు. లోకంలో ప్రతీ ఒక్కరికీ నేను నచ్చాల్సిన అవసరం లేదు, ఎవరి కోసమో నా తత్వాన్ని నేను మార్చుకోలేను. నేను సరదాగా ఉండటం వల్ల నా కుటుంబం, స్నేహితులు సంతోషంగా ఉంటారు, అది నాకు చాలు" అని ఆమె తేల్చి చెప్పారు. ప్రస్తుతం రష్మిక చేసిన ఈ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఇక 'రణబాలి' సినిమా విషయానికొస్తే.. రాహుల్ సాంకృత్యాయన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్, టీ-సిరీస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ పాన్-ఇండియా చిత్రం 1854 నుంచి 1878 మధ్య జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతోంది. ఇప్పటికే ఈ సినిమా ప్రపంచాన్ని పరిచయం చేస్తూ నాలుగు భాగాల డాక్యుమెంటరీ సిరీస్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ శక్తివంతమైన యోధుడి పాత్రలో కనిపించనుండగా, అజయ్-అతుల్ సంగీతం అందిస్తున్నారు.

# నీకు ఎయిడ్స్ ఉందా అని అడిగాడు

## బిగ్‌బాస్‌లో నటి గాయత్రి సురేష్ సంచలన వ్యాఖ్యలు!

**కొచ్చి, అక్టోబర్ 6 (స్పంద న్యూస్):** ప్రముఖ రియాలిటీ షో 'బిగ్‌బాస్' వేదికగా మలయాళ నటి గాయత్రి సురేష్ తన వ్యక్తిగత జీవితంలో ఎదురైన తీవ్రమైన చేదు అనుభవాన్ని పంచుకుని సంచలనం సృష్టించారు. ప్రముఖ నటుడు మోహన్‌లాల్ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న 'బిగ్‌బాస్ మలయాళం సీజన్-8'లో పాల్గొంటున్న ఆమె.. ఓ టాస్క్ సందర్భంగా తన గతం, విఫలమైన సంబంధాల గురించి భావోద్వేగంగా మాట్లాడారు. టాస్క్‌లో భాగంగా జీవితంలో మిమ్మల్ని అత్యంత తీవ్రంగా గాయపరిచిన వ్యక్తితో మాట్లాడే అవకాశం వస్తే ఏం చెబుతారని బిగ్‌బాస్ ప్రశ్నించగా.. గాయత్రి 2021 నాటి సంఘటనను గుర్తు చేసుకున్నారు. అప్పట్లో తాను ఒక వ్యక్తిని తన జీవిత భాగస్వామిగా భావించి 'సిచుయేషన్‌షిప్'లో ఉన్నానని తెలిపారు. బంధం మొదలైన తొలి వారంలోనే సదరు వ్యక్తి "నీకు ఎయిడ్స్ ఉందా?" అని ప్రశ్నించాడని, ఆ మాట తన మనసును తీవ్రంగా గాయపరిచిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆ క్షణమే అతనితో సంబంధాన్ని తెంచుకున్నానని వెల్లడించారు. తరువాత అతనికి వేరొకరితో సంబంధం ఉందని తెలిసిందని, అంతేకాకుండా అదే సమయంలో తనకు జరిగిన కారు ప్రమాదం, వివాదాల సమయంలో సదరు వ్యక్తి తనను ఒంటరిగా వదిలేసి వెళ్లిపోయాడని తెలిపారు. తన జీవితంలో పలువురు బాధపెట్టినప్పటికీ, తనను అత్యంత తీవ్రంగా క్షోభకు గురిచేసిన సంఘటన ఇదేనని గాయత్రి సురేష్ కన్నీటిపర్యంతమయ్యారు. ప్రస్తుతం ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలోనూ, సినీ వర్గాల్లోనూ తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.





# 'సిగ్మా'తో నా జర్నీ.. మరువలేనిది!

## కోలీవుడ్ ఎంట్రీపై ఫరియా అబ్దుల్లా ఆసక్తికర వ్యాఖ్యలు

### 'ప్రేక్షకుల ఆదరణ చూస్తుంటే ఆనందంగా ఉంది'

**చెన్నై, అక్టోబర్ 6 (స్పంద న్యూస్):** 'సిగ్మా'తో మొదలైన నా తమిళ సినీ ప్రయాణం ఇప్పటికే ప్రత్యేకం.. ఇప్పుడు ప్రేక్షకుల నుంచి వస్తున్న ఆదరణ చూస్తుంటే ఈ జర్నీ మరింత మరువలేనిదిగా మారుతోంది' అంటూ నటి ఫరియా అబ్దుల్లా ఆనందం వ్యక్తం చేశారు. సందీప్ కిషన్ హీరోగా, జాసన్ సంజయ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'సిగ్మా'తో కోలీవుడ్‌లోకి అడుగుపెట్టిన ఆమె.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో సినిమా అనుభవాలను పంచుకున్నారు. లైకా ప్రొడక్షన్స్ నిర్మించిన యాక్షన్ అడ్వెంచర్ డ్రామా 'సిగ్మా' అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ నేపథ్యంలో దర్శకుడు జాసన్ సంజయ్‌తో కలిసి పనిచేసిన అనుభవం గురించి ఫరియా మాట్లాడుతూ.. ఆయనకు తన కథను తెరపై ఎలా చూపించాలనే విషయంలో ఎంతో స్పష్టత ఉందని తెలిపారు. 'జాసన్ సంజయ్‌తో పనిచేయడం అద్భుతమైన అనుభవం. తాను ఏం తెరకెక్కించాలనుకుంటున్నారనే విషయంలో ఆయనకు పూర్తి స్పష్టత, ఆత్మవిశ్వాసం ఉన్నాయి. అదే ఉత్సాహం మా అందరిలోనూ జోష్ నింపింది. టీమ్ మొత్తం ఈ ప్రాజెక్టును ఎంతో ఆస్వాదిస్తూ పూర్తి చేసింది' అని ఫరియా చెప్పారు. 'సిగ్మా'తో తన తమిళ సినీ ప్రయాణాన్ని ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. థియేటర్లలో సినిమాను చూస్తూ ప్రేక్షకుల స్పందనను ప్రత్యక్షంగా గమనించడం ప్రత్యేకమైన అనుభూతిని ఇస్తోందని పేర్కొన్నారు. ఈ చిత్రంలో భాగం కావడం, ప్రేక్షకుల నుంచి ఆదరణ లభించడం తనకు సంతోషాన్నిస్తోందని ఫరియా తెలిపారు.



# ఆసక్తికరంగా 'కామ్రేడ్ కళ్యాణ్' ట్రైలర్

కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్' శ్రీ విష్ణు హీరోగా నటిస్తున్న చిత్రం 'కామ్రేడ్ కళ్యాణ్'. జానకిరామ్ మారెళ్ల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కోన వెంకట్ సమర్పిస్తున్నారు. స్కంద వాహన మోషన్ పిక్చర్స్ ఎల్ఎల్‌పీ బ్యానర్‌పై వెంకట కృష్ణ కర్నాటి, సీతా కర్నాటి నిర్మిస్తున్నారు. మహిమా నంబియార్ కథానాయిక, ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, టీజర్ పాటలతో సినిమాపై అంచనాలు పెరిగాయి. అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది ఈ సినిమా. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్ ను విడుదల చేశారు.



"This newspaper is published by **JAMMUGANI MOHAN** from D.No. 13-19 Selapadu, Guntur, Andhrapradesh - 522213. on behalf of AK PUBLICATIONS, Editor by **JAMMUGANI MOHAN** and printed by JANAPATI VENKATA RAMESH BABU at D.NO. 5-74A, GANGIREDDY PALEM, BELLAMKONDA, GUNTUR, ANDHRA PRADESH - 522411." **PRGI NO: APMUL/26/A3106**. Email: epaper.spandanews@gmail.com , Cell: **94908 24686**

ప్రజాగళమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక
బుధవారం, 7 అక్టోబర్ 2026

# తల్లి బిడ్డల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

## జాతీయ పోషణ మాసోత్సవంలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



అమృతలూరు, అక్టోబరు 6 స్పంద న్యూ : కూచిపూడి 6వఅంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన జాతీయ పోషణ మాసోత్స వం--2026లో వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గర్భిణీలు, బాలిం తలు, చిన్నారులకు నాణ్యమైన పౌష్టికా హారం అందిస్తూ వారి ఆరోగ్య సంరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఎమ్మెల్యే తెలిపారు. ఆశా, అంగన్వాడీ, వైద్య సిబ్బంది సమన్వయంతో తల్లి బిడ్డల ఆరోగ్యంపై మరింత శ్రద్ధ వహించాలని సూచిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిన్నా రులకు అన్నప్రాసన, గర్భిణీలకు సామూ హిక సీమంతం నిర్వహించారు. అంగ న్వాడీ కేంద్రాలకు వంట సామగ్రి, కార్య కర్తలకు నూతన యూనిఫాం చీరలు, చిన్నారులకు2పుస్తకాలు పంపిణీ చేశా రు. కార్యక్రమంలో సీడీపీఓ లక్ష్మీదేవి, అంగన్వాడీ సూపర్వైజర్లు, అధికారులు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు బ్రహ్మానాయుడు ఉన్నత పాఠశాల విద్యార్థుల ఎంపిక




కారంపూడి, అక్టోబర్ 6 ( పల్నాడు జిల్లా ) స్పంద న్యూస్ : – స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉమ్మడి గుంటూరు జిల్లాలో 14, 17 సంవత్సరాల లోపు బాల బాలికల జట్టుల ఎంపికను ఈ నెల మూడు, నాలుగు తేదీలలో కారంపూడి బ్రహ్మానాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీల ద్వారా ఎంపిక జరిగిపిన విషయం తెలిసినదే. ఈ ఎంపి కలో స్థానిక బ్రహ్మానాయుడు జిల్లా పరిషత్తు హైస్కూల్ విద్యార్థిని, విద్యార్థులు హర్షిత, అఖిల, మాధురి, రేవతి, జస్లిక, హర్షద్ లు ఉమ్మడి గుంటూరు జిల్లా తరపున రాష్ట్రస్థాయిలో ఆడేందుకు ఎంపికైనట్లుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివశేషిరెడ్డి తెలియజేశారు. ఎంపికైనా విద్యార్థులు ఈనెల 10, 11,12 తేదీలలో కారంపూడి లోని బ్రహ్మానాయుడుజిల్లా ఉన్నత పాఠశాలలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలలో ఉమ్మడి గుంటూరు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని పాఠశాల పి డి మరియు స్టేట్ టోర్న మెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బి ఐ స్వర్ణ రాజు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు శివసేసిరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు స్వర్ణ రాజు,అమల, సుష్మిత ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు బోధ నేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

# పల్నాడులో పరుగులు తీసిన చైతన్యం.. ఉత్సాహంగా 'రెడ్ రన్' మారథాన్

## వివక్షను తరిమికొడదాం.. బాధితులను ఆదరిద్దాం: డాక్టర్ మాధవీలత, ఆనంద్ బెంజిమన్



నరసరావుపేట, అక్టోబర్ 06 (స్పంద న్యూస్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు, 'యూత్ ఫెస్ట్ – 2026'లో భాగంగా హెచ్ఐవి/ఎయిడ్స్ నివారణ, అవగాహనే లక్ష్యంగా పల్నాడు జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో మంగళవారం 'రెడ్ రన్ మారథాన్' ఘనంగా నిర్వహించారు. ఈ పరుగు పందెంలో 17 నుంచి 25 సంవత్సరాల వయస్సు గల కళాశాల యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహం కనబరిచారు. కార్యక్రమంలో జిల్లా కుష్టు, ఎయిడ్స్ మరియు టిబి నియంత్రణ అధికారి డాక్టర్ మాధవీలత మాట్లాడుతూ యువత హెచ్ఐవి/ఎయిడ్స్ పై శాస్త్రీయ సమాచారాన్ని తెలుసుకోవాలని, బాధ్యతాయుత ప్రవర్తన, సురక్షిత ఆరోగ్య పద్ధతుల ద్వారా మాత్రమే దీని వ్యాప్తిని అరికట్టగలమని స్పష్టం చేశారు. అనంతరం ప్రముఖ స్వచ్ఛంద సంస్థ 'హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్' ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆనంద్ బెంజిమన్ మాట్లాడుతూ హెచ్ఐవి పట్ల సమాజంలో ఉన్న భయాలు, అపోహలను తుడిచిపెట్టే శక్తి యువతకు ఉందన్నారు. హెచ్ఐవి తాకడం వల్ల, కలిసి తిరగడం వల్ల వ్యాపించదని, బాధితులు సరైన చికిత్స, పౌష్టికాహారంతో నిండు నూరేళ్లు జీవించవచ్చని తెలిపారు. బాధితులను ఒంటరి చేయకుండా, వివక్షకు తావులేకుండా సమాజంలో గౌరవప్రదమైన స్థానం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హనుమ కుమార్, దిశా సిబ్బంది, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, కళాశాలల అధ్యాపకులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.



## ఎన్నికలు అడ్డుకోవాలన్న జగన్ ఆలోచనలు

# అనైతికం, అప్రజాస్వామికం : ప్రత్తిపాటి

**-అధికారంలో ఉన్నప్పుడు దుర్మార్గపు పోకడలతో గెలిచి నేడు ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా తప్పుడు కేసులు వేస్తున్నారు : ప్రత్తిపాటి**

**-అభివృద్ధికి సహకరించాల్సిన తన నైతిక ధర్మాన్ని జగన్ విస్మరిస్తున్నారు : ప్రత్తిపాటి**

**-ఓటమి తప్పదని తెలిసే ప్రజాక్షేత్రంలో పోరాటానికి వెనకడుగు వేస్తున్నారు : ప్రత్తిపాటి**



చిలకలూరిపేట అక్టోబర్ 6 స్పంద న్యూస్: అధికారంలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రిస్థానంలో ఉండి ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా బలవంతపు ఏకగ్రీవాలు, నామినేషన్ల అడ్డగింతలు, అభ్యర్థుల్ని బెదిరించడం, బరిలో నిలిచినవారిని భయపెట్టేందుకు ఏకంగా చంపేయడం వంటి అప్రజాస్వామిక చర్యల్ని అడ్డగోలుగా ప్రోత్సహించారు. జగన్. వైసీపీ నేతలు నాడు తమ దుర్మార్గపు పోకడలతో స్థానిక ఎన్నికల్లో గెలిచి, నిస్సిగ్గుగా సంబరాలు చేసుకున్నారు. అటువంటి వారు నేడు ప్రజాస్వామ్యయుతంగా, ఎన్నికల నియమావళి ప్రకారం రాష్ట్రంలో నిర్వహించనున్న స్థానిక ఎన్నికల్ని అడ్డుకునేందుకు తప్పుడు కారణాలతో కోర్టుల్లో నిరాధారమైన కేసులు వేయడం సిగ్గుచేటు. బీసీ రిజర్వేషన్ల అమలు, స్థానిక ఎన్నికల నిర్వహణపై వైసీపీ సానుభూతిపరులు న్యాయస్థానాలకు తప్పుడు సమాచారం అందిస్తూ, వ్యవస్థల్ని తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్రంలో ఆరువారాల్లో స్థానిక ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాలన్న హైకోర్టు స్పష్టమైన ఆదేశాలపైనా వైసీపీ నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించడం.. కచ్చితంగా అప్రజాస్వామికమే. బీసీలకు సముచిత రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి.. వారికి రాజకీయంగా న్యాయం చేయాలన్న కూటమి ప్రభుత్వ సదాశయాన్ని కూడా జగన్ నీరుగారుస్తున్నాడు. 34 శాతం రిజర్వేషన్ల అమలును అడ్డుకుంటూ ఏకంగా సుప్రీం తలుపుతట్టాడు. తన పాలనలో బీసీలను రాజకీయంగా అణగదొక్కిన జగన్.. నేడూ అదే పంథాను అనుసరిస్తున్నాడు. జగన్ .. వైసీపీనేతల వైఖరి ముమ్మాటికీ అనైతికత.. అప్రజాస్వామికమే. ప్రజలు స్థానిక ఎన్నికల్ని త్వరగా నిర్వహించాలని కోరుతున్న తరుణంలో వారి అభిప్రాయాలకు విరుద్ధంగా జగన్. వైసీపీ వ్యవహరించడం సిగ్గుచేటు. చట్టపరమైన అభ్యంతరాలపై న్యాయస్థానాల్ని ఆశ్రయించడం సహజంగా జరిగేదే. కానీ వైసీపీ మాత్రం కూటమిప్రభుత్వంపై అక్కసుతో, రాజకీయ స్వలాభంతో ప్రజలకు, రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తోంది.

**ఓటమి తప్పదని తెలిసే.. జగన్ ప్రజాక్షేత్రంలో పోరాటానికి వెనకడుగు వేస్తున్నారు.**

సకాలంలో ఎన్నికలు జరపకుంటే రాష్ట్రానికి వచ్చే కేంద్ర నిధులు ఆగిపోతాయని తెలిసినా జగన్ తన కుట్రలు కొనసాగించడం ప్రజాద్రోహం కాదా? గ్రామాలు, పట్టణాల్లో మౌలిక వసతుల కల్పన కన్నా... తన పట్టింపులు, పంతాలు, రాజకీయాలకే జగన్ ప్రాధాన్యత ఇస్తున్న జగన్ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారు. స్థానిక సమరంలో ఓటమి తప్పదని తెలిసే జగన్.. ప్రజాక్షేత్రంలో పోరాటానికి వెనకడుగు వేస్తున్నారు అభివృద్ధికి సహకరించాల్సిన నైతికధర్మాన్ని విస్మరిస్తున్న జగన్ కు భవిష్యత్ లో మరోసారి తగిన గుణపాఠం చెబుతారు."

# తైక్వాండోలో సత్తా చాటిన శ్రీ గౌతమి విద్యార్థులు




**రాష్ట్రస్థాయి పోటీల్లో మూడు బంగారు పతకాలు**

చీరాల అక్టోబర్ 6( స్పంద న్యూస్ ) : క్రీడా రంగంలో శ్రీ గౌతమి విద్యాసంస్థల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశార ని యాజమాన్యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తైక్వాండోలో అద్భుత ప్రతిభ కనబరిచిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో మూడు బంగారు పతకాలు సాధించి సత్తా చాటారని తెలియజేశారు. అక్టోబర్ 1న కందుకూరులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్--19 జిల్లా స్థాయి తైక్వాండో సెలక్షన్స్‌లో శ్రీ గౌతమి విద్యాసంస్థలకు చెందిన స్టీఫెన్ జాన్ పాల్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అనంతరం అక్టోబర్ 2న గుంటూరులో ఆత్మకూరు తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫస్ట్ సెంట్రల్ జోన్ స్టేట్ మీట్‌లో గౌతమి విద్యాసంస్థలకు చెందిన ముగ్గురు విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. స్టీఫెన్ జాన్ పాల్ సీనియర్ విభాగం అండర్--55 కేజీల కేటగిరీలో గోల్డ్ మెడల్, మేరీస్టెల్లా అండర్--55 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్, సి. హెచ్. పూజిత ఓవర్--73 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించారు.

ముగ్గురూ.. మూడు స్వర్ణాలు

ఒకే విద్యాసంస్థకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని, మూడు విభాగాల్లోనూ బంగారు పతకాలు సాధించడం విశేషంగా చెప్పుకోవచ్చు. ఈ విజయంతో శ్రీ గౌతమి విద్యాసంస్థల యాజమాన్యం, అధ్యాపకులు, తల్లిదండ్రులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీ గౌతమి విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ ఎం.వి. మాస్టారు, సీనియర్ కామర్స్ అధ్యాపకులు, డిగ్రీ కళాశాల ఇంచార్జ్ వి. శ్రీనివాసరావు విజేతలను అభినందించారు. తైక్వాండో కోచ్‌లు ఎస్.డి. సల్లావుద్దీన్, పి. ప్రశాంత్ బాబు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# నందివెలుగు ఆర్వోబీ పనులు వేగవంతం చేయాలి

**రోజువారీ లక్ష్యాలకు అనుగుణంగా పనులు పూర్తి చేయాలి**

**కాంట్రాక్ట్‌కు గుంటూరు నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఆదేశాలు**



గుంటూరు, అక్టోబరు 6 (మనసులో మాట): నందివెలుగు రైల్వే వంతెన (ఆర్వోబీ) నిర్మాణ పనులను రోజువారీ లక్ష్యాలకు అనుగుణంగా వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. మంగళవారం రైల్వే, జిఎంసి, ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి నందివెలుగు రోడ్డులో జరుగుతున్న ఆర్వోబీ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వంతెన నిర్మాణ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి, ప్రతిరోజూ నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా అవసరమైన సిబ్బంది, కార్మికులను అదనంగా కేటాయించి పనుల వేగాన్ని పెంచాలని స్పష్టం చేశారు.

**రెండు రోజుల పాటు రైల్వే గేట్ మూసివేత**

వంతెన నిర్మాణ పనుల కోసం రైల్వే గేట్‌ను రెండు రోజుల పాటు మూసివేసి అవసరమైన పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. ఈ సమయంలో ట్రాఫిక్ నియంత్రణకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రైల్వే, ట్రాఫిక్, జిఎంసి అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

గడువులోగా పనులు పూర్తి చేయాలి ఆర్వోబీ ప్రారంభానికి ఇప్పటికే గడువు నిర్దేశించిన నేపథ్యంలో, దానికి అనుగుణంగా నిర్మాణ పనులు పూర్తి చేయాల్సిన బాధ్యత కాంట్రాక్టర్‌పై ఉందని కమిషనర్ స్పష్టం చేశారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట అదనపు మానవ వనరులను వినియోగించి పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. కమిషనర్ పర్యటనలో జిఎంసి సిటీ ప్లానర్ రాంబాబు, ఈఈ సుందర్రామిరెడ్డి, రైల్వే, ఆర్అండ్‌బీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.




# మందుబాబులకు కోర్టు జరిమానా

చిలకలూరిపేట అక్టోబర్ 6 స్పంద న్యూస్: పట్టణంలో మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇద్దరు వ్యక్తులతో పాటు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన మరో ఆరుగురిని చిలకలూరిపేట పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన ఈ ఎనిమిది మందిని పోలీసులు స్థానిక చిలకలూరిపేట కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసును విచారించిన సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ షేక్ మహబూబ్ సుభాని నిందితులకు జరిమానా విధించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కింద పట్టుబడిన ఇద్దరికి ఒక్కొక్కరికి రూ. 10,000 చొప్పున మొత్తం రూ. 20,000 జరిమానా విధించగా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన ఆరుగురికి తలా రూ. 500 చొప్పున మొత్తం రూ. 3,000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

# ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ సన్నాహాలు

## నిబంధనలపై పూర్తి అవగాహనతో నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలి



గుంటూరు, అక్టోబరు 6 (స్పంద న్యూస్ ): సాధారణ పురపాలక ఎన్నికలను అత్యుత్తమ స్థాయిలో, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అధికారులు ముందస్తు సన్నాహాలు పూర్తి చేయాలని మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ సూచించారు. మంగళవారం గుంటూరు వైద్య కళాశాల ఆడిటోరియంలో జరిగిన ప్రాంతీయ సమాయత్త సమావేశంలో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు.ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే అవసరమైన పనులు పూర్తి చేసుకోవాలని, రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలపై అధికారులకు పూర్తి అవగాహన ఉండాలని అన్నారు. చిన్నపాటి తప్పిదాలకు కూడా తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించి ప్రజల విశ్వాసాన్ని చూరగొనాలని సూచించారు.మున్సిపల్ పరిపాలన కమిషనర్ పి.సంపత్ కుమార్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలను పకడ్బందీగా సిద్ధం చేయడంతో పాటు పోలింగ్ కేంద్రాల తనిఖీలు, రిజర్వేషన్లు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, గ్రీన్ కోడ్ అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.జీఎంసి కమిషనర్ కె.మయూర్ అశోక్ మాట్లాడుతూ ఎన్నికలు తక్కువ సమయంలో పూర్తి చేయాల్సి ఉన్నందున అధికారులు ముందుగానే సిద్ధంగా ఉండాలని సూచించారు. బ్యాలెట్ పెట్టెల ద్వారా ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆర్వోలు కీలక బాధ్యతలు నిర్వర్తించాలన్నారు. వదంతులపై తక్షణమే స్పందించి ప్రజలకు వాస్తవాలను తెలియజేయాలని సూచించారు.గుంటూరు ప్రాంతీయ సంచాలకులు సూర్యదేవర హరికృష్ణ మాట్లాడుతూ ప్రాంతంలో 33 మున్సిపాలిటీలు ఉండగా ప్రస్తుతం 24 మున్సిపాలిటీలకు ఎన్నికల నిర్వహణకు సన్నద్ధంగా ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో ఆర్వోలు, ఏఆర్వోలు, మున్సిపల్ అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి: సీఐటీయూ



బాపట్ల, అక్టోబర్ 6 స్పంద న్యూస్: రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ కి ఆయన నివాసం లో ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) ఆధ్వర్యంలో మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా సి ఐ టి యు బాపట్ల పట్టణ నాయకులు కె. శరత్ మాట్లాడుతూ,ఆశా వర్కర్లు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా తక్కువ పారితోషికంతో పనిచేస్తున్న ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని, పనికి తగిన పారితోషికం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే ఆశా వర్కర్లకు పని భారం తగ్గించాలని, పెండింగ్‌లో ఉన్న పారితోషికాలు వెంటనే చెల్లించాలని, సెలవులు మరియు ఇతర కార్మిక హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు.కమ్యూనిటీ హెల్త్ వర్కర్లుగా పనిచేస్తున్న ఆశా వర్కర్లను కేవలం ప్రోత్సాహకాలపై ఆధారపడే విధానంలో కాకుండా, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారికి తగిన వేతనాలు, సౌకర్యాలు కల్పించాలని కోరారు.ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లను ఎమ్మెల్యే నరేంద్ర వర్మ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించే వరకు సీఐటీయూ వారి పోరాటాలకు అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పట్టణ గ్రామీణ ప్రాంత ఆశ కార్యకర్తలు బాపట్ల మండల ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు కృష్ణవేణి రాహేలు కోటమ్మ సుజాత స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు 'విద్యుత్ సేవా సేతు'

# సద్వినియోగం చేసుకోవాలి

### శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య




చీరాల అక్టోబర్ 6 ( స్పందన న్యూస్ ): నియోజకవర్గ ప్రజలు విద్యుత్ సేవా సేతును సద్వినియోగం చేసుకోవాలని సహసభ్యులు మద్దులూరి మాల కొండయ్య పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'విద్యుత్ సేవా సేతు' పాల్గొని శాసనసభ్యులు మాట్లాడారు. ప్రధానమంత్రి సూర్య ఘర్--ముఫ్త్ బిజ్లీ యోజనపై ప్రజలకు అవగాహన కల్పించడం, ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటును ప్రోత్సహించడం ఈ సేవా సేతు కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు వివరించారు.

అర్హత కలిగిన గృహ వినియోగదారులకు సబ్సిడీ, దరఖాస్తు విధానం, నెట్ మీటరింగ్, సోలార్ ప్లాంట్ ఏర్పాటు తదితర అంశాలపై ఒకే వేదికగా సమాచారం అందించేలా కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల అవసరాలకు అనుగుణంగా సంక్షేమంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజలకు చేరువ చేస్తోందని తెలిపారు. ఇంటి పైకప్పుపై సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవడంతో పాటు పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని పెంచే అవకాశం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీతో పాటు బ్యాంకు రుణాలు, సాంకేతిక మార్గదర్శకాలు, సోలార్ వెండర్ల సేవలు అందుబాటులో ఉండటంతో ప్రజలకు ప్రక్రియ మరింత సులభతరం అవుతుందని అధికారులు తెలిపారు. ఏపీసీపీడీసీఎల్ పరిధిలో అక్టోబర్ 6, 7, 8 తేదీల్లో సేవా సేతు అభియాన్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రకటించింది.ప్రజలకు నేరుగా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే ప్రజలకు తెలియపరిచారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు పోలీస్ శాఖ సన్నాహాలు



## ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే ఏర్పాట్లు పూర్తి చేయాలి: డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా

గుంటూరు, అక్టోబరు 6 స్పంద న్యూస్ : స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు నోటిఫికేషన్‌కు ముందే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా పోలీస్ అధికారులను ఆదేశించారు.గుంటూరు పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రాంతీయ సమాయత్త సమావేశంలో ఎన్నికల భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. సమస్యాత్మక, సున్నిత, అత్యంత సున్నిత ప్రాంతాలు, పోలింగ్ కేంద్రాలను ముందుగానే గుర్తించి ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు.రౌడీషీటర్లు, సమస్యాత్మక వ్యక్తులపై నిఘా పెట్టడంతో పాటు ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని, అక్రమ మద్యం, నగదు పంపిణీ, అక్రమ రవాణాను అరికట్టేందుకు చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గత ఎన్నికల్లో నమోదైన కేసులపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.బ్యాలెట్ బాక్సుల రవాణా, స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత కల్పించాలని, రూట్ మొబైల్స్, మొబైల్ పార్టీలతో నిరంతర గస్తీ నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయడంతో పాటు సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు, వదంతులు, రెచ్చగొట్టే ప్రచారంపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. ఓటర్లు ఎలాంటి భయం, ఒత్తిడి, ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా ఓటు వేసేలా భరోసా కల్పించాలని అన్నారు.గుంటూరు ఐజీపీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తదితరులు జిల్లాల పరిస్థితులు, ఎన్నికల సన్నాహాలను వివరించారు. పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, ఎన్నికల అధికారుల మధ్య సమన్వయం కీలకమని అధికారులు పేర్కొన్నారు.

## రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే దంపతుల ప్రత్యేక పూజలు



చీరాల అక్టోబర్ 6 ( స్పంద న్యూస్ ) రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ శ్రీశ్రీశ్రీ కనక నాగారప్పమ్మ దేవస్థానంలో ఎమ్మెల్యే మద్దులూరి మాల కొండయ్య దంపతులు వరుణ యాగంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం స్థానిక వేటపాలెం మండలం రావూరిపేట గ్రామంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ నాగవరపమ్మ దేవస్థానంలో శాసనసభ్యులు మాలకొండయ్య, ధర్మపత్ని బాలకొండమ్మ ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. రాష్ట్రం పచ్చని పంటలతో సస్యశ్యామలంగా ఉండాలని, రైతన్నలు సుభిక్షంగా ఉండాలని, ప్రజలకు సాగునీరు, తాగునీటి కొరత లేకుండా రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా మొత్తం 175 నియోజకవర్గాల్లో ఒకేసారి వరుణ యాగాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ఎంపిక చేసిన దేవాదాయశాఖ ఆలయంలో ఈ యాగాన్ని నిర్వహించారు. ఈ క్రమంలో చీరాల నియోజకవర్గంలో వేటపాలెం మండలం రావూరిపేట గ్రామంలో శ్రీశ్రీశ్రీ కనక నాగారప్పమ్మ దేవస్థానంలో వరుణ యాగాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించామన్నారు.రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, చెరువులు, కాలువలు, జలాశయాలు నిండాలని, రైతులకు వ్యవసాయానికి అవసరమైన నీరు సమృద్ధిగా అందాలని, ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈనాటి కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం జనసేన బిజెపి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కంచర్ల సేవకు కదలి వచ్చిన స్వచ్ఛ ఆంధ్ర అవార్డు

### ఈ అవార్డు మరింత బాధ్యతను పెంచింది

### హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కంచర్ల బుల్లిబాబు



సత్తెనపల్లి,అక్టోబర్ 6 (స్పంద): సత్తెనపల్లి పట్టణము కేంద్రంగా హెల్ప్ ఫౌండేషన్ స్థాపించి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వ్యవస్థాపకులు కంచర్ల బుల్లిబాబుకు గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛ ఆంధ్ర అవార్డును పల్నాడు జిల్లా మెజిస్ట్రేట్ గౌరవనీయులు కలెక్టర్ కృత్తికా శుక్ల,నరసరావుపేట శాసనసభ్యులు గౌరవనీయులు చదలవాడ అరవింద బాబు చేతులమీదుగా నరసరావుపేట పట్టణంలోని భువనచంద్ర టౌన్ హాల్ నందు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా కంచర్ల బుల్లి బాబు మాట్లాడుతూ ఈ అవార్డు మరింత బాధ్యతను పెంచిందని, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలు, వివిధ ప్రభుత్వ హాస్టల్స్ లో విరివిగా మొక్కలు నాటడం జరిగిందని,మహిళా సంఘాలకు,అంగన్వాడి మహిళలకు ప్లాస్టిక్ పై అవగాహన కలిగించి, నానో వేవ్ పాలిథిన్ బ్యాగులు పంపిణీ, పర్యావరణానికి హాని కలిగించకుండా గత మూడు సంవత్సరాల నుంచి మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేయడమే కాకుండా,తడి చెత్త,పొడి చెత్తపై ర్యాలీలు, దోమలపై దండయాత్రలు లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలలో, విద్యార్థులలో చైతన్యం నింపుతూ,రైల్వే స్టేషన్ లాంటి ప్రాంతాల్లో కూడా స్వచ్ఛతహే సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ,హెల్ప్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలను ఇప్పటివరకు నిర్వహించిందని,వాటర్ పొదుపు,వాన నీటిని ఒడిసి పడదాం లాంటి కార్యక్రమాలతో పర్యావరణం పట్ల మక్కువ చూపిందని అన్నారు.ఈ అవార్డు రావడానికి నాకు సహకరించిన అధికారులకు,హెల్ప్ ఫౌండేషన్ సభ్యులకు ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యుత్ సబ్ స్టేషన్ ఆధ్వర్యంలో సోలార్ పై అవగాహన

కర్లపాలెం అక్టోబర్ 6 స్పంద న్యూస్. కర్లపాలెం ఐలాండ్ సెంటర్లో కర్లపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ ఆధ్వర్యంలో సోలార్ పై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూ డి సి ఎం రమేష్ బాబు ఎల్ఐ ఎన్ శ్రీకాంత్ ఎల్ ఎం సయ్యద్ ఇమామ్ సాహెబ్ ఎల్డీసీ వర్మ, జేఎల్ఎం యారం చిన్న తదితరులు అవగాహన కార్యక్రమం లో పాల్గొన్నారు.సబ్సిడీ పై వచ్చే సోలార్ ను ప్రజలు సద్వినియోగపరచుకోవాలని కోరారు. సోలార్ ను వాడటం వలన విద్యుత్ బిల్లు ఆదా అవుతుంది అని అన్నారు.



# గుంటూరులో మొబైల్ క్రెచ్ కేంద్రాల ఏర్పాటు

## మహిళలు, చిన్నారులకు ఉపయోగకరంగా సేవలు




గుంటూరు, అక్టోబరు 6 (స్పంద న్యూస్ ): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా), మొబైల్ క్రెచెస్ సంయుక్త ఆధ్వర్యంలో గుంటూరులో మూడు మొబైల్ క్రెచ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. పనిచేసే మహిళలు, వారి కుటుంబాలకు, ముఖ్యంగా చిన్నారుల సంరక్షణకు ఈ కేంద్రాలు ఉపయోగపడనున్నాయి.గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఆధ్వర్యంలో గుర్తించిన మూడు కేంద్రాల నిర్వహణకు స్థానిక స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యుల్లో ఒక్కో కేంద్రానికి ముగ్గురు చొప్పున ఎంపిక చేసి, మొబైల్ క్రెచెస్ సంస్థ ఆధ్వర్యంలో ఎనిమిది రోజుల శిక్షణ అందించారు.

## ఫోటో అవగాహన సదస్సులో పాల్గొన్న ఎంపీడీవో లక్ష్మీదేవి

## అన్నపర్రు లోచెత్త నుండి సంపద తయారీపై అవగాహన



పెదనందిపాడు అక్టోబర్ 6 (స్పంద న్యూస్)మండలంలోని అన్నపర్రు గ్రామంలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రం షెడ్ ను ఎంపీడీవో లక్ష్మీదేవి మంగళవారం ఫీల్డ్ ఎక్స్పోజర్ విజిట్ చేశారు. అన్ని గ్రామ పంచాయతీల పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్ లకు అవగాహన సదస్సు నిర్వహించారు. చెత్త నుండి సంపద తయారీ నిర్వహణ,పని తీరు,తడి వ్యర్థాల సేకరణ, నాడెప్/నేల గుంటలు/సిమెంట్ రింగులతో ఏర్పాటు చేసిన పిట్స్ నందు తడి వ్యర్థాలను నింపడం మరియు ప్రాసెసింగ్, వర్మి పిట్లు/ బెడ్ల నిర్వహణ,వానపాముల సంరక్షణ, వర్మి కంపోస్ట్ సేకరణ ఉత్పత్తి మరియు నిల్వ, ఉత్పత్తిని తూకం వేసి ,రికార్డుల్లో నమోదు చేయడం, వర్మి కంపోస్ట్ నాణ్యత,విక్రయాలు మరియు మార్కెటింగ్ మొదలగు అంశాల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన అన్నపర్రు సచివాలయ సిబ్బందిని ఎంపీడీవో లక్ష్మీదేవి ప్రత్యేకంగా అభినందించారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పి శ్వేత, ఏ అపర్ణ, బి భాగ్యరాజు, ఎల్ గోపి, మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు. గ్రీన్ అంబాసిడర్ సిబ్బంది పాల్గొన్నారు.

## రేషన్ సరుకుల పంపిణీలో పారదర్శకతే లక్ష్యం

## మంత్రి మనోహర్



తెనాలి,అక్టోబర్06(స్పంద న్యూస్)స్థానిక చెంచుపేట వాటర్ ట్యాంక్ సమీపంలోని రేషన్ షాప్‌ను రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. రేషన్ షాప్‌లోని బియ్యం, ఇతర నిత్యావసర సరుకుల స్టాక్ నిల్వలను పరిశీలించి,ఈ-పాస్ మెషీన్‌లో నమోదైన వివరాలతో స్టాక్‌ను సరిపోల్చి చూశారు. కొత్తగా అమల్లోకి వచ్చిన బియ్యం బస్తాలపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి, వాటికి సంబంధించిన వివరాలను పరిశీలించారు.అలాగే రేషన్ షాప్ వద్ద ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి, ప్రజలు తమ అభిప్రాయాలు, సూచనలు, ఫిర్యాదులను నేరుగా నమోదు చేసే విధానాన్ని పరిశీలించారు. ఈ వ్యవస్థ ద్వారా ప్రజల నుంచి వచ్చే అభిప్రాయాలు, ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.లబ్ధిదారులకు సరుకుల పంపిణీ ఏ విధంగా జరుగుతోంది, వారికి ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి అనే విషయాలను కూడా అడిగి తెలుసుకున్నారు.ప్రజలకు అందాల్సిన రేషన్ సరుకుల విషయంలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వం అందిస్తున్న సరుకులు సక్రమంగా చేరేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి మనోహర్ సూచించారు.

# జిల్లాలో ఆరు ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు ప్రారంభం

## గ్రామీణ ప్రజలకు ముంగిట్లోనే వైద్య సేవలు

గుంటూరు, అక్టోబరు 6 (స్పంద న్యూస్ ): గ్రామీణ ప్రజలకు స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు గుంటూరు జిల్లాలో ఆరు నూతన ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళవారం వర్చువల్‌గా రాష్ట్రవ్యాప్తంగా 265 ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించారు.ఈ కేంద్రాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో 105 రకాల మందులు, 14 రకాల ఉచిత వైద్య పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి. జిల్లాలో లాలుపురం, చేబ్రోలు-2, కొలకలూరు (ఉత్తర), కటీవరం, ఈమని-1, ఈమని-2 కేంద్రాలు ప్రారంభమయ్యాయి.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ మాట్లాడుతూ ప్రజల చెంతకే ఆరోగ్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.




# వైభవంగా కొప్పుల వారి ఓణీల వేడుకలు



దాచేపల్లి, అక్టోబరు 6(స్పంద న్యూస్ ). పల్నాడు జిల్లా దాచేపల్లి మున్సిపల్ ఛైర్మన్, వైసిపి సీనియర్ నాయకులు కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య మనుమరాలు, వైసిపి యువనేత కొప్పుల రవికుమార్ కుమార్తె వెంకట నిషిత ఓణీల బహుకరణ వేడుకలు మంగళవారం దాచేపల్లి పట్టణంలో వైభవం గా జరిగాయి. ఓణీల బహుకరణ వేడుకలకు వైసిపి నాయ కులు, కార్యకర్తలు భారీగా హాజరై చిన్నారి నిషితను ఆశీర్వదించారు. మాజీ మంత్రి అంబ టి రాంబాబు, మాజీ ఎమ్మెల్యే లు పిన్నెల్లి రామకృష్ణ రెడ్డి, కాసు మహేష్ రెడ్డి, జక్కం పూడి రాజా, గుంటూరు ఈస్ట్ నియోజకవర్గ సమన్వయ కర్త నూరి ఫాతిమా, మాజీ ఎమ్మెల్సీ టిజివి కృష్ణారెడ్డి హాజరై చిన్నారిని అశీర్వదించారు. అధేవిదంగా తెలం గాణా రాష్ట్ర మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి వేడుకలకు హాజరై చిన్నారిని ఆశీర్వదించి తమ అశీస్సులు అందించారు. అధేవిదంగా కాపు ఐక్య వేదిక నాయకులు దాసరి రాము తో సుబ్బారావు లు హాజరయ్యారు.పట్టణంలోని కె ఎస్ ఆర్ హైట్స్ అపార్ట్మెంట్ వద్ద ఏర్పాటు చేసిన భారీ వేదిక వచ్చిన అతిధులను విశేషం గా అకర్షించింది. వేడుకలకు గురజాల నియోజకవర్గం తో పాటు పల్నాడు జిల్లా లోని వివిధ నియోజకవర్గాల నుంచి సుమారు 6 వేల మంది హాజరయ్యారు. అంతేగాకుండా సాంబయ్య కుమారుడు గురజాల నియోజకవర్గ వైసిపి యువ నాయకులు కొప్పుల రవికుమార్ జన్మదినం కూడా కావటం తో మంగళవారం అర్ధరాత్రి పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో బర్త్ డే కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు రవికుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీపీ, జెడ్పీటిసి లతో నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలతో పాటు పట్టణంలోని ప్రముఖులు హాజరయ్యారు.

# గుంటూరులో సేవా సేతు అభియాన్ పీఎం సూర్యఘర్ ప్రారంభం




గుంటూరు, అక్టోబరు 6 (స్పంద న్యూస్ ):: వినియోగదారులపై విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించడంతో పాటు సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో చేపట్టిన సేవా సేతు అభియాన్ -- పీఎం సూర్యఘర్ కార్యక్రమాన్ని గుంటూరు నగరంలోని నల్లచెరువు విద్యుత్ కార్యాలయంలో సీపీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ ఏ. మురళీకృష్ణ యాదవ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎం సూర్యఘర్ పథకం కింద గృహ విద్యుత్ వినియోగదారులకు ఆర్థిక సహాయం అందిస్తున్నాయని తెలిపారు. 1 కిలోవాట్ సామర్థ్యానికి రూ.30,000, 2 కిలోవాట్లకు రూ.60,000, 3 కిలోవాట్లు లేదా అంతకంటే ఎక్కువ సామర్థ్యానికి గరిష్ఠంగా రూ.78,000 వరకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు వివరించారు.సౌర విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడవచ్చని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా అధికారి చల్లా రమేష్, గుంటూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీహెచ్ ఖాన్, టౌన్-3 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కేవీ సుబ్బారావు, అసిస్టెంట్ ఇంజనీర్లు పీబీ కిరణ్ కుమార్, కే. సాంబశివరావు, ఎం. ఉదయ్ కిరణ్, బి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## మిరప తోటలను పరిశీలించిన

# ఉద్యానశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు

దాచేపల్లి, అక్టోబర్6,(స్పంద న్యూస్ ). పల్నాడు జిల్లా లోని దాచేపల్లి మండలంలోని ముత్యాలంపాడు, శంకరాపురం, మాదినపాడు గ్రామాల్లో మిరప తోటలను ఉద్యానశాఖ అధికారులు , లాం ఫారం శాస్త్రవేత్తలు పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమానికి విచ్చేసిన డాక్టర్ సి. వెంకటరమణ మాట్లాడుతూ, ఉద్యాన అధికారి మోహన్‌తో పాటు గ్రామ ఉద్యాన అసిస్టెంట్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు సహకారంతో మూడు గ్రామాల్లోని మిరప పంటలను పరిశీలించినట్లు తెలిపారు.ప్రస్తుతం మిరప పంటలు సుమారు 30 నుంచి 50 రోజుల దశలో ఉన్నాయని, కొన్ని శాకీయదశ , మరికొన్ని తోటల్లో పూత దశ ప్రారంభమైందని తెలిపారు. పరిశీలనలో ప్రధానంగా కొన్ని ప్రాంతాల్లో భూమిలో తేమ శాతం తగ్గిపోవడంతో మొక్కలు వాడిపోవడం, ఎండిపోవడం, గమనించినట్లు పేర్కొన్నారు.మొక్కలు ఎండిపోవడానికి రైతులు ఎండు తెగులు లేదా వేరు కుళ్ళు తెగుళ్లను కారణంగా భావించి ఆందోళన చెందుతున్నప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో ప్రధాన కారణం తగినంత తేమ లేకపోవడంగా గుర్తించినట్లు డాక్టర్ వెంకటరమణ తెలిపారు. తోటల్లో అవసరమైన సమయంలో నీటి తడులు ఇవ్వాలని సూచించారు.

భూమిలో తేమను ఎక్కువకాలం నిలుపుకోవడానికి మల్చింగ్ పద్ధతిని పాటించాలని, అంతర్ సేద్యం చేయడం వలన భూమి నుంచి తేమ ఆవిరైపోవడాన్ని కొంతవరకు తగ్గించవచ్చని సూచించారు. తద్వారా మొక్కలు ఎండిపోకుండా కొంతకాలం రక్షించవచ్చని తెలిపారు.

అలాగే ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకునేలా మొక్కలకు



సూక్ష్మ పోషకాలైన పొటాషియం నైట్రేట్ 5 గ్రాములు లేదా యూరియా 10 గ్రాములను ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. బోర్ల ద్వారా లేదా కాలువల ద్వారా నీరు అందుబాటులోకి వచ్చిన వెంటనే తగిన నీటి తడులు ఇవ్వడం ద్వారా మిరప తోటలను పునరుద్ధరించి మంచి దిగుబడులు పొందే అవకాశం ఉందన్నారు.ప్రస్తుతం పరిశీలించిన తోటల్లో నల్ల తామర పురుగు, తెల్లదోమ ఉధృతి పెద్దగా కనిపించలేదని తెలిపారు. తెల్లదోమ నివారణకు పెగాసిస్, సఫీనా, లేనో సిఫారసు చేసిన పురుగుమందులను మార్చి మార్చి ఉపయోగించడం ద్వారా తెల్లదోమ ద్వారా వ్యాప్తి చెందే వైరస్ తెగుళ్లను నియంత్రించవచ్చని సూచించారు.నల్ల తామర పురుగు నివారణకు ప్రారంభ దశల్లో రీజెన్ట్, జంపు, పోలీస్, ఎక్స్పోనస్, సిమోడిస్, గ్రేషియా తగిన మందుల్ని చేసిన మందులను మార్చి మార్చి ఒకదాని తర్వాత మరొకటి 10--15 రోజుల వ్యవధిలో అవసరాన్ని బట్టి పిచికారీ చేయాలని సూచించారు. తద్వారా నల్ల తామర పురుగు ఉధృతిని నియంత్రించి మిరప పంటను కాపాడుకోవచ్చని తెలిపారు.అదేవిధంగా ప్రస్తుతం వర్షాలు పడిన వెంటనే లేదా నీటి తడులు ఇచ్చిన అనంతరం, పంట అవసరాన్ని బట్టి ఎకరాకు ఒక బస్తా యూరియా, అర బస్తా పొటాష్ వేయడం ద్వారా మొక్కలు బాగా ఎదగడంతో పాటు పూత, పిందె నిలుపుదల మెరుగుపడి మంచి దిగుబడి సాధించవచ్చని సూచించారు.రైతులు పంటలో కనిపించే లక్షణాలను తెగుళ్లుగా భావించి అనవసరంగా ఆందోళన చెందకుండా, భూమిలో తేమను కాపాడుతూ, అవసరమైన నీటి తడులు ఇవ్వడంతో పాటు ఉద్యానశాఖ అధికారుల సూచనల మేరకు ఎరువులు, పురుగుమందులను వినియోగించాలని అధికారులు సూచించారు.ఈ కార్యక్రమం లో ఉద్యానవన శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# పెదకాకానిలో వరుస చోరీ కేసులు ఛేదింపు

## 24 గంటల్లోనే ఇద్దరు నిందితుల అరెస్ట్.. మూడు కేసుల్లో చోరీ సొత్తు స్వాధీనం

పెదకాకాని, అక్టోబరు 6 (స్పంద న్యూస్ ): పెదకాకాని పోలీస్ స్టేషన్ పరిధిలోని లూథర్‌గిరి కాలనీలో జరిగిన వరుస ఇళ్ల దొంగతనం కేసులను పోలీసులు 24 గంటల్లోనే ఛేదించారు. ఎస్పీ ఆదేశాల మేరకు నార్త్ డీఎస్పీ పర్యవేక్షణలో సీఐ, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది ప్రత్యేకంగా దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల దృశ్యాలతో పాటు సాంకేతిక ఆధారాలను విశ్లేషించి నిందితులను గుర్తించారు.ఈ క్రమంలో కూరపాటి సంతోష్‌కుమార్, కూరపాటి సరితలను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి మూడు కేసుల్లో చోరీకి గురైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.దర్యాప్తులో నిందితులు ముందుగా ఇళ్ల తాళాలను దొంగిలించి, ఆయా ఇళ్లలో ఎవరూ లేని సమయాన్ని గమనించి, దొంగిలించిన తాళాలతోనే ఇళ్లలోకి ప్రవేశించి చోరీలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. కేసులను వేగంగా ఛేదించడంలో సీసీ కెమెరాలు, సాంకేతిక ఆధారాలు కీలకంగా మారాయని పోలీసులు తెలిపారు.



# బాపట్లలో వైఎస్సార్‌సీపీ సభ్యత్వ ఐడీ కార్డుల పంపిణీ

## స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి ఐకమత్యంగా కృషి చేయాలి: కోన రఘుపతి

బాపట్ల, అక్టోబరు 6( స్పంద న్యూస్ ): బాపట్ల పట్టణంలోని 11వ వార్డులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు పార్టీ సభ్యత్వ ఐడీ కార్డులను మాజీ డిప్యూటీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కోన రఘుపతి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కోన రఘుపతి మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వార్డు నాయకులు, కార్యకర్తలు ప్రజలతో నిరంతరం మమేకమై పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో, ఐకమత్యంగా పనిచేయాలని సూచించారు.అలాగే బాపట్ల మున్సిపల్ చైర్మన్‌గా వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకునేందుకు నాయకులందరూ ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని కోన రఘుపతి సూచించారు. వార్డుల వారీగా పార్టీ శ్రేణులు ప్రజల సమస్యలను తెలుసుకుని, ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆయన కోరారు.

# బీటీ రోడ్డు, కమ్యూనిటీ హాల్ ను ప్రారంభించిన మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి,అక్టోబర్06(స్పంద న్యూస్) నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం మార్గ్ అపార్ట్‌మెంట్ నుంచి క్యూబా మసీదు వరకు నిర్మించిన 450 మీటర్ల బీటీ రోడ్డును తెనాలి నియోజకవర్గ శాసనసభ్యులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలు మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. స్థానిక ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రహదారి సౌకర్యాన్ని మెరుగుపరిచే ఉద్దేశంతో ఈ బీటీ రోడ్డు పనులను పూర్తి చేశారు. రహదారికి అవసరమైన సైడ్ బర్మ్స్ ఏర్పాటుకు అదనంగా నిధులను ఇప్పుడు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు.అనంతరం స్థానిక ప్రజల అవసరాల కోసం నిర్మించిన చీ= కమ్యూనిటీ హాల్‌ను మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు పూర్తికావడంతో ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. స్థానిక ప్రజలు, సీనియర్ సిటిజన్స్ సమావేశాలు, వైద్య శిబిరాలు, వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశాలు



అవగాహన కార్యక్రమాలతో పాటు శుభకార్యాలు, ఇతర సామాజిక కార్యక్రమాలకు ఈ హాల్‌ను వినియోగించుకోవచ్చని, కమ్యూనిటీ హాల్‌ను ప్రజలకు పూర్తిస్థాయిలో ఉపయోగపడేలా ఒక కమిటీని ఏర్పాటు చేసి, మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షణలో నిర్వహించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉడా కాలనీ ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రహదారి, కమ్యూనిటీ హాల్ వంటి మౌలిక వసతుల పనులను ఇప్పటికే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని పేర్కొన్నారు. భవిష్యత్తులో స్థానిక చిన్నారులు, పెద్దలు, సీనియర్ సిటిజన్స్‌కు ఉపయోగపడేలా ఒక పార్కును కూడా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాలనీని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.